GSTIN-NO:36FKPSI308PIZX

epaper:tmedia.net.in

# టి-మీడియా

సామాజికం... ప్రజల పక్షం

మెయిన్




సంపుటి : 6 | సంచిక : 250 | ఎడిటర్ : శనగపాటి మురళీకృష్ణ | బుధవారం 01-05-2024 | పేజీలు : 4




# బీజేపీ ఓటమితోనే దేశ ఐక్యత

- అందుకే కాంగ్రెస్‌కు మద్దతు
- మోడీ పాలనలో రాజ్యాంగ సంస్థలు, స్వతంత్ర వ్యవస్థలు నిర్వీర్యం
- రఘురాంరెడ్డి గెలుపు బాధ్యత తీసుకుంటాం.
  సీపీఐ(ఎం సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం
- కార్పొరేట్లకు దోచిపెడుతున్న మోడీ: ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క
- బీజేపీ పాలనలో ప్రజల మధ్య విద్వేషాలు: మంత్రి పొంగులేటి
- కాంగ్రెస్, కమ్యూనిస్టులకు అందుబాటులో ఉంటా: అభ్యర్థి రఘురాంరెడ్డి

**టి మీడియా, ఏప్రిల్ 30,ఖమ్మం :** దేశ ఐక్యతకు విఘాతం కలిగిస్తూ...రాక్షస శక్తిగా ముందుకొస్తున్న బీజేపీని ఎదుర్కొనేందుకే కాంగ్రెస్, కమ్యూనిస్టులు ఒకే వేదికపైకి వచ్చి ఇండియా కూటమిగా ఏర్పడ్డారని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం తెలిపారు. దీనిలో భాగంగా రాష్ట్రంలో భువనగిరి పార్లమెంట్ స్థానం మినహా మిగిలిన 16 చోట్లా కాంగ్రెస్‌కు సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు ప్రకటించారు. కాంగ్రెస్ ఖమ్మం లోక్‌సభ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ స్థానిక ఎస్ఆర్ గార్డెన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన సీపీఐ(ఎం) ఖమ్మం పార్లమెంట్ విస్తృత స్థాయి సమావేశంలో తమ్మినేని మాట్లాడారు. ఈ సమావేశానికి ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రి మల్లు భట్టివిక్రమార్క, రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచారశాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో పాటు అభ్యర్థి రఘురాంరెడ్డి, సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్‌రావు అతిథులుగా హాజరయ్యారు.

### ఎన్డీఏను గద్దె దించడమే లక్ష్యం: తమ్మినేని వీరభద్రం

పదేళ్ల మోడీ పాలనలో దేశానికి ప్రమాదకరంగా మారిన ఎన్డీఏ ప్రధాన శత్రువుగా ఇండియా కూటమి ఆవిర్భవించిందన్నారు. దీని ప్రధాన లక్ష్యం ఎన్డీఏను ఈ ఎన్నికల్లో గద్దె దించడమేనని తెలిపారు. బీజేపీ విధానపరంగా దేశ ఉనికికే ప్రమాదకరమన్నారు. బీజేపీ వెనుక ప్రజల మధ్య విద్వేషాలను రగిల్చే ఓ ఫాసిస్టు సిద్ధాంతం ఉందన్నారు. బీజేపీ హిందూ రాజ్యమంటే ఆ మతంలోని అగ్రకులాల రాజ్యమని వివరించారు. భారత రాజ్యాంగంలో ముఖ్య సారాంశం సమానత్వాన్ని రూపుమాపే సనాతన మనుధర్మాన్ని బీజేపీ ముందుకు తీసుకొస్తోందన్నారు. అంబేద్కర్ రాజ్యాంగాన్ని అడ్డుతొలగించుకుంటే మనుధర్మాన్ని స్వేచ్ఛగా అమలు చేయాలనేదే బీజేపీ వ్యూహంగా పేర్కొన్నారు. ప్రతిపక్షాలే కాదు రాజకీయ పార్టీలన్నింటినీ నిర్వీర్యం చేసి ఏకవ్యక్తి రాజ్యంలా దేశాన్ని మార్చాలని మోడీ ప్రభుత్వం చూస్తోందన్నారు. ఆర్థిక దోపిడీని విశృంఖలం చేసేందుకు పూనుకుందని తెలిపారు. రాజ్యాంగ సంస్థలు, స్వతంత్ర వ్యవస్థలను నిర్వీర్యం చేసే చర్యలు...చివరకు వాక్‌స్వాతంత్ర్యాన్ని సైతం హరించేలా బీజేపీ వ్యవహరిస్తోందన్నారు. బీజేపీని ఓడిరచడం ద్వారానే దేశ ఐక్యత సాధ్యమన్నారు. రాజకీయాలు వ్యాపారమయం అయ్యాయని, అధికారంలో ఉన్న పార్టీ చుట్టూ తిరిగే పరిస్థితులు ఉత్పనమయ్యాయని తెలిపారు. రామహాసహాయం రఘురాంరెడ్డి స్థానికుడు...ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం చేగొమ్మ ఆయన స్వస్థలమని తెలిపారు. ఆయన గెలుపు బాధ్యతను సీపీఐ(ఎం) స్వీకరిస్తుందని, ఆయన అందుబాటులో ఉండి ప్రజాసేవ చేసేలా చూస్తానని తమ్మినేని మాట ఇచ్చారు.





### దేశ రక్షణకు ఏకం కావాలి: డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క

దేశ రక్షణకు అందరం ఏకం కావాలని ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రి మల్లు భట్టివిక్రమార్క పిలుపునిచ్చారు. కాంగ్రెస్ అధిష్టానం, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు తాను స్వయంగా సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యాలయానికి వెళ్లి మద్దతు కోరానన్నారు. దేశ రాజకీయ పరిస్థితుల దృష్ట్యా సంఘటితంగా వెళ్దామని ముందుకు వచ్చిన సీపీఐ(ఎం) నాయకత్వానికి భట్టి కృతజ్ఞతలు తెలిపారు. దేశ సంపద ప్రజలకు చెందేలా చూడటమే కాంగ్రెస్, కమ్యూనిస్టుల లక్ష్యమన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను కొద్దిమంది పెట్టుబడిదారుల చేతుల్లో పెడుతున్న బీజేపీని సాగనంపడమే ధ్యేయంగా ముందుకెళ్దామన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణకు కాంగ్రెస్ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డిని గెలిపించాలని పిలుపునిచ్చారు.

### సీపీఐ(ఎం) సహకారం మర్చిపోలేను: రెవెన్యూ మంత్రి పొంగులేటి

తమ్మినేని సారథ్యంలో సీపీఐ(ఎం) సహకారంతోనే 2014లో నేను ఎంపీనయ్యానని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచారశాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఈ విషయాన్ని తాను ఎప్పటికీ మర్చిపోనన్నారు. అలాగే రామసహాయం రఘురాంరెడ్డికి కూడా వెన్నుదన్నుగా నిలవాలని కోరారు. దేశంలో ఇందిరమ్మ ప్రభుత్వాన్ని తెచ్చుకున్నాక కామ్రేడ్లు కోరుకున్న పాలనను అందిస్తామన్నారు. అక్షితల పేరుతో మాయ మాటలు చెప్పి బీజేపీ ఓట్లు దండుకోవాలని చూస్తుందన్నారు. ఈసారి ఎన్డీఏ కూటమిని ఇంటికి పంపి..నూటికి నూరుశాతం 'ఇండియా కూటమి' అధికారంలోకి వస్తుందని పొంగులేటి ధీమా వ్యక్తం చేశారు. సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి సారథ్యంలో పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తామన్నారు.

సీపీఐ(ఎం) ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శులు నున్నా నాగేశ్వరరావు, అన్నవరపు కనకయ్య అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్‌రావు, పార్టీ సీనియర్ నాయకులు కాసాని ఐలయ్య, ఎం.సుబ్బారావు, ఖమ్మం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు యర్రా శ్రీకాంత్, పొన్నం వెంకటేశ్వర్లు, మాచర్ల భారతి, భూక్యా వీరభద్రం, బుగ్గవీటి సరళ, బంతు రాంబాబు, కళ్యాణం వెంకటేశ్వర్లు, వై.విక్రమ్, కొత్తగూడెం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఏజే రమేశ్, మచ్చా వెంకటేశ్వర్లు, కారం పుల్లయ్య, కె.పుల్లయ్య, బ్రహ్మచారి, కాంగ్రెస్ నాయకులు బాలసాని లక్ష్మీనారాయణ, రాయల వెంకటేశ్వర్లు, మద్దినేని బేబిస్వర్ణకుమారి, మిక్కిలినేని నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# టీడీపీ కూటమి మేనిఫెస్టో విడుదల..

- మహిళలు, రైతులు, నిరుద్యోగులపై వరాల జల్లు
- ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం
- ప్రతి ఇంటికీ ఉచిత కుళాయి కనక్షన్..

**టి మీడియా, ఏప్రిల్ 30, అమరావతి బ్యూరో:**

ఆంధ్రప్రదేశ్ ఎన్నికల నేపథ్యంలో టీడీపీ, జనసేన, బీజేపీ (ఎన్డీఏ) కూటమి మేనిఫెస్టోను విడుదల చేసింది. ఉండవల్లిలో తెలుగు దేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు, జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్, బీజేపీ రాష్ట్ర ఇన్‌ఛార్జి సిద్ధార్థనాథ్‌సింగ్‌లు మేనిఫెస్టోను ఆవిష్కరించారు. ఇప్పటికే సూపర్ సిక్స్ పథకాలతో ప్రజల్లోకి వెళుతున్న ఎన్డీఏ కూటమి మరికొన్ని హామీలతో ఈ మేనిఫెస్టోను తయారు చేసింది. పలు కీలకమైన హామీలతో టీడీపీ, జనసేన, బీజేపీల కూటమి మేనిఫెస్టో 2024ను రూపొందించారు. ప్రధానంగా ఈ మేనిఫెస్టోలో పింఛన్లు, మహిళలకు పథకాలపై ఫోకస్ పెట్టారు. సామాజిక పింఛన్లు రూ.4 వేలకు పెంపు, ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితం, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం వంటి హామీలు ఇప్పటికే ప్రజల్లోకి తీసుకెళ్లారు. వీటితో పాటుగా మెగా డీఎస్సీపై మొదటి సంతకం, సామాజిక పింఛను రూ.4 వేలకు పెంచడంతో పాటుగా.. ఇది 2024 ఏప్రిల్ నుంచే వర్తింపచేస్తారు. వికలాంగులకు పింఛను రూ.6 వేలకు పెంపు..బీసీలకు 50 ఏళ్లకే పింఛను అందిస్తామన్నారు. ఆడబిడ్డ నిధి కింద 18 ఏళ్లు నిండిన ప్రతి మహిళకు నెలకు రూ.1,500 చొప్పున ఏడాదికి రూ.18 వేలు అందజేస్తామని ఇప్పటికే ప్రకటించారు. యువతకు ఏటా 4 లక్షల చొప్పున ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు.. నిరుద్యోగ యువతకు నెలకు రూ.3 వేల చొప్పున భృతి హామీలను ఇప్పటికే ఇచ్చారు. 'తల్లికి వందనం' కింద చదువుకుంటున్న పిల్లలకు ఒక్కొక్కరికి ఏడాదికి రూ.15 వేల చొప్పున ఆర్థిక సాయం అందిస్తామని ఇప్పటికే హామీ ఇచ్చారు. రైతులకు ఏడాదికి రూ.20 వేల చొప్పున పెట్టుబడి సాయం.. వాలంటీర్ల గౌరవవేతనం రూ.10 వేలకు పెంపు వంటి హామీలు ఉన్నాయి. ప్రతి పేద కుటుంబానికి రెండు సెంట్ల ఇంటి స్థలం.. నాణ్యమైన సామగ్రితో మంచి ఇంటి నిర్మాణం వంటి హామీలు కూడా చేర్చారు.ఇసుక ఉచితం.. బీసీల రక్షణకు ప్రత్యేక చట్టం.. ప్రతి ఇంటికీ ఉచిత కుళాయి కనెక్షన్.. స్వచ్ఛమైన తాగునీటి సరఫరా.. భూ హక్కు చట్టం రద్దు.. కరెంటు ఛార్జీలు పెరగవు అంటున్నారు. చేనేత కార్మికులకు మగ్గం ఉంటే 200.. మర మగ్గాలుంటే 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ హామీని చేర్చారు. పెళ్లి కానుక కింద రూ.లక్ష అందజేత.. విదేశీ విద్య పథకం పునరుద్ధరణ.. పండుగ కానుకలు మళ్లీ ప్రారంభం.. నాణ్యతలేని మద్యాన్ని అరికట్టి, ధరల నియంత్రణ వంటివి ఉన్నాయి. రైతులకు గతంలో టీడీపీ ప్రభుత్వం అందించిన రాయితీ పథకాల పునరుద్ధరణ.. ఆక్వారైతులకు రూ.1.50కే యూనిట్ విద్యుత్.. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు పథకాల పునరుద్ధరణ. చేనేతలకు ప్రత్యేక విధానాలు, పథకాలు కూడా ఉన్నాయి.టీడీపీ అధినేత చంద్రబాబు 11 నెలల క్రితమే రాజమహేంద్రవరంలో నిర్వహించిన మహానాడులో సూపర్ సిక్స్ పేరుతో మినీ మేనిఫెస్టోను ప్రకటించిన సంగతి తెలిసిందే. జనసేనతో పొత్తు ఖరారయ్యాక ఆ పార్టీతో సంప్రదించి మరికొన్ని హామీలను జోడించారు. టీడీపీ, జనసేన, బీజేపీతో పొత్తు ఖాయమయ్యాక మూడు పార్టీల నేతలు ఉమ్మడి మేఫెస్టోపై కసరత్తు చేశారు. నేటి అవసరాలు తీరుస్తాం- రేపటి ఆకాంక్షలు నెరవేరుస్తాం అంటూ ఈ మేనిఫఎస్టోను రూపొందించారు. సమాజంలోని అన్నివర్గాల అభ్యున్నతి కోసం మరిన్ని కొత్త పథకాలను ఎన్డీఏ కూటమి ప్రకటించింది. 2014-2019 మధ్య టీడీపీ కొన్ని పథకాలను అమలు చేసింది.. అయితే వాటిలో నిలిచిపోయిన వాటిని మళ్లీ అమలు చేయాలని నిర్ణయించారు. అన్న క్యాంటీన్‌లు, పండుగ కానుకలు వంటివి ఉన్నాయి. టీడీపీ గతంలో ప్రకటించిన సూపర్ సిక్స్‌ను ఇప్పటికే ఎన్నికల ప్రచారంలో ముమ్మరంగా ప్రజల్లోకి తీసుకెళ్తున్నారు. ప్రింట్, టీవీ, సోషల్ మీడియాలో ప్రకటనల రూపంలో విస్తృత ప్రచారం కల్పిస్తున్నారు



# రాజ్యాంగం అంటే అంత గౌరవం మాకు

- కాళేశ్వరంప్రాజెక్ట్ పేరుతో బిఆర్ఎస్ పెద్దస్కామ్ చేసింధి
- జహీరాబాద్ సభలో ప్రధాని మోదీ వ్యాఖ్యలు..

**టి మీడియా, ఏప్రిల్ 30, జహీరాబాద్ :**

మండేఎండను సైతం లెక్కచేయకుండా సుడిగాలి ప్రచారం చేస్తున్నారు ప్రధాని మోదీ. వరుస ప్రచార సభలు, రోడ్‌షోల్లో పాల్గొంటూ భారతీయ జనతా పార్టీ కార్యకర్తల్లో జోష్ నింపుతున్నారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా తెలంగాణ గడ్డపై మరోసారి అడుగుపెట్టారు ప్రధానమంత్రి నరేంద్రమోదీ. అత్యధిక ఎంపీ సీట్ల గెలుపే లక్ష్యంగా ఇవాళ మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో పర్యటిస్తున్నారు. జహీరాబాద్ లో జరిగే బీజేపీ సభలో ప్రధాని మోదీ పాల్గొని మాట్లాడారు.. కాంగ్రెస్, బీఆర్ఎస్ టార్గెట్ గా సంచలన వ్యాఖ్యలు చేశారు. అంతేకాకుండా రాజ్యాంగాన్ని పరిరక్షిస్తానన్నారు. అంబారీపై రాజ్యాంగం వెళ్తుంటే నేను నడుచుకుంటూ వెళ్లా.. రాజ్యాంగం అంటే అంత గౌరవం మాకు.. నా తుదిశ్వాస వరకు రాజ్యాంగాన్ని పరిరక్షిస్తా అంటూ మోదీ అన్నారు.తెలంగాణలో డబుల్ %=% ట్యాక్స్ తీసుకొచ్చారు.. డబుల్ %=% ట్యాక్స్‌పై విస్తృత చర్చ జరుగుతోంది.. వ్యాపారులు, కాంట్రాక్టర్లు ఆర్ ఆర్ ట్యాక్స్ కడుతున్నారు.. ల్ నల్లధనం ఢిల్లీకి చేరుతోంది.. ఆర్ ఆర్ ఎవరో మీకు ఇప్పటికే అర్థమై ఉంటుంది..ఆర్ ఆర్ ట్యాక్స్‌ను అడ్డుకోకపోతే సర్వనాశనం తప్పదు.. అంటూ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ రేవంత్ రెడ్డి టార్గెట్ గా ఫైర్ అయ్యారు. జహీరాబాద్ బీజేపీ విజయసంకల్ప సభలో పాల్గొన్న ప్రధాని మోదీ బీఆర్ఎస్, కాంగ్రెస్ పై ఫైర్ అయ్యారు. కాళేశ్వరంప్రాజెక్ట్ పేరుతో బి ఆర్ ఎస్ పెద్దస్కామ్ చేసిందన్నారు. కాళేశ్వరం అవినీతిపై విచారణ చేస్తామని కాంగ్రెస్ మాట తప్పిందంటూ విమర్శించారు. ఓటుకు నోటు కేసును గతంలో బీఆర్ఎస్ తొక్కిపెట్టిందని.. కాళేశ్వరం స్కామ్‌ని కాంగ్రెస్ తొక్కిపెడుతోందని ఆరోపించారు.అవినీతిలో ఆ రెండు పార్టీలు భాగస్వాములేనని.. గతంలో బీఆర్ఎస్ రాష్ట్రాన్ని నాశనం చేసింది.. ఇప్పుడు కాంగ్రెస్ సర్వనాశనం చేస్తోందని పేర్కొన్నారు.



బీఆర్ఎస్-కాంగ్రెస్ రెండూ ఒక గూటి పక్షులేనని వివరించారు. కాంగ్రెస్ మరో దోపిడీకి సిద్ధమైందని.. ప్రజలపై వారసత్వ పన్ను విధించబోతోంది.. మీ సంపదలో 55% లాక్కుంటామని చెబుతోందంటూ మోదీ అన్నారు. ఫేక్ వీడియోపై కూడా ప్రధాని మోదీ స్పందిస్తూ.. తెలంగాణ కాంగ్రెస్‌కి మోదీ వార్నింగ్ ఇచ్చారు. రేవంత్ రెడ్డి ఫేక్ వీడియోలు విడుదల చేస్తున్నారు. ఫేక్ వీడియోలను విడుదల చేసినవాళ్లను వదిలే ప్రసక్తే లేదు.. ఆర్ ఆర్ కి తెలంగాణ ప్రజలు ఓటుతో బుద్ధి చెప్పాలన్నారు. తెలంగాణ అభివృద్ధి బీజేపీ గెలుపుతోనే సాధ్యమన్నారు.ఎస్సీ వర్గీకరణకు తాము కట్టుబడి ఉన్నామని.. ఎస్సీ వర్గీకరణను కాంగ్రెస్ వ్యతిరేకిస్తోందన్నారు. మాదిగలకు తప్పకుండా న్యాయం చేస్తామన్నారు.క్వింటాల్‌కి రూ.500 బోనస్ అని బోగస్ మాటలు చెప్పారు.. రుణమాఫీపై తెలంగాణలో కాంగ్రెస్ మాట తప్పింది.. 100రోజుల్లో రుణమాఫీ అని కాంగ్రెస్ మోసంచేసిందంటూ ఫైర్ అయ్యారు.లింగాయత్ రిజర్వేషన్లకు కాంగ్రెస్ వ్యతిరేకం.ముస్లిం రిజర్వేషన్లకు మాత్రం కాంగ్రెస్ అనుకూలం అంటూ మోదీ అన్నారు. బంజారా రిజర్వేషన్ల విషయంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ మోసం చేశాయన్నారు.అంబారీపై రాజ్యాంగం వెళ్తుంటే నేను నడుచుకుంటూ వెళ్లా.. రాజ్యాంగం అంటే అంత గౌరవం మాకు.. నా తుదిశ్వాస వరకు రాజ్యాంగాన్ని పరిరక్షిస్తా అంటూ మోదీ అన్నారు.

# మేనిఫెస్టో సాక్షిగా కూటమిలో కుంపటి..

- చంద్రబాబు, పవన్ సమక్షంలో బయటపడ్డ విబేధాలు..

**టి మీడియా, ఏప్రిల్ 30, అమరావతి బ్యూరో:**

సీట్ల సర్దుబాటు జరిగింది. అంతా బాగానే ఉందనుకున్న సమయంలోనే.. అంతర్గతంగా ఇంకేదో జరిగిపోతోంది.. ఈ క్రమంలోనే పొత్తు.. ఉందా లేదా..? ఉంటే ఇలా జరుగుతుందేంటి..? ఎన్నికల వేళ ఈ గొడవలేంటి..? ఇలా తెలుగుదేశం, జనసేన, బీజేపీ క్యాడర్‌లో ఇప్పుడు సరికొత్త సందేహాలు వెంటాడుతున్నాయి. ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలకు సమయం దగ్గరపడుతున్న వేళ.. ఏపీ కూటమిలో కుంపట్లు మొదలవ్వడం రాజకీయాల్లో సంచలనంగా మారింది.. కూటమిలో విబేధాలు తారాస్థాయికి చేరాయి.. అనడానికి కూటమి మేనిఫెస్టో విడుదల వేదికగా మారింది. పైకి ఇంతలా కనిపిస్తే.. లోలోపల ఇంకెంత ఉందోనంటూ ఏపీ రాజకీయాల్లో హాట్ టాపిక్ గా మారింది..ఎన్డీఏ కూటమి పార్టీలైన తెలుగుదేశం, జనసేన, బీజేపీ మేనిఫెస్టోను మంగళవారం చంద్రబాబు నాయుడు, పవన్ కల్యాణ్ విడుదల చేశారు.. అయితే.. వేదికపై బీజేపీకి చెందిన సిద్ధార్థ్ నాథ్ సింగ్ కూడా హాజరయ్యారు. అంతా బాగుందనుకున్న సమయంలోనే.. కూటమి మేనిఫెస్టో విడుదల కొంచెం ఆలస్యం అయింది.. చంద్రబాబు నాయుడు, పవన్ కల్యాణ్, సిద్ధార్థ్ నాథ్ సింగ్ వేదికపై నుంచి మేనిఫెస్టో కాపీలను విడుదల చేశారు. ఈ క్రమంలోనే.. చంద్రబాబు, పవన్ కల్యాణ్ చేతుల్లో కూటమి మేనిఫెస్టోను పట్టుకుని.. మీడియాకు చూపించారు.. అయితే..



అక్కడ సిద్ధార్థ్ నాథ్ సింగ్ చేతుల్లో మాత్రం కూటమి మేనిఫెస్టో కాపీ కనిపించలేదు.. కట్ చేస్తే.. ఆయనకు మేనిఫెస్టో కాపీని ఇవ్వడానికి ప్రయత్నించారు.. కానీ.. ఆయన తన చేతులతో మేనిఫెస్టో కాపీ పట్టుకోవడానికి నిరాకరించారు.. మేనిఫెస్టో కాపీ చేతికి ఇస్తున్నా బీజేపీ ఇన్చార్జ్ సిద్ధార్థ్‌సింగ్ వద్దని వారిస్తూ సైగలు చేశారు.. అయితే.. వీటన్నింటికి సవా లక్ష కారణాలు ఉన్నట్లు ప్రచారం జరుగుతుండటం రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. పేరుకు పొత్తులో మూడు పార్టీలున్నా.. మేనిఫెస్టో ఇద్దరిదేనా? అన్నట్టు కనిపించింది. కూటమి మేనిఫెస్టోకి మోదీ గ్యారంటీ, బీజేపీ మద్దతు లేనట్టేనా?.. అంటే అవునన్నట్టే మేనిఫెస్టో బుక్ లెట్.. ఆ కార్యక్రమం కనిపించింది. మేనిఫెస్టో కాపీపై చంద్రబాబు, పవన్ ఫోటోలు మాత్రమే.. ఉండటం.. కాపీపై ఎక్కడా కనిపించని మోదీ ఫోటో, బీజేపీ గుర్తు కనిపించకపోవడంతో కమలం నేతలు గుస్సా అయ్యారు.. అంతేకాకుండా.. కనీసం మేనిఫెస్టోపై కూటమి సింబల్ ఎక్కడా కనిపించలేదు.. దీంతో కాపీని పట్టుకునేందుకు బీజేపీ నేతలు ఇష్టపడలేదని తెలుస్తోంది. ఉచితాలను దేశవ్యాప్తంగా వ్యతిరేకిస్తుంది బీజేపీ.. ఫ్రీబీస్ వల్ల నష్టం అని జాతీయస్థాయిలో అభిప్రాయాన్ని వెల్లడించింది. తాజా ఏపీ కూటమి మేనిఫెస్టోలో అనుచితంగా ఉచితాలు.. ప్రకటించడం.. మేనిఫెస్టో విడుదలకు హాజరైనా అంటీముట్టనట్లుగా బీజేపీ వ్యవహరించడం.. చివరకు మేనిఫెస్టోకి బీజేపీ మద్దతు లేదన్నట్లుగానే రాష్ట్రంలో హాట్ టాపిక్ గా మారింది. అయితే.. కూటమి మేనిఫెస్టోకి బీజేపీ ఆశీస్సులు లేకపోతే ఎలా అని ప్రశ్నలు పుట్టుకొస్తున్నాయి.

## పదవ తరగతి ఫలితాల్లో సత్తా చాటిన గిరిజన అమ్మాయి

**టి మీడియా, ఏప్రిల్ 30,రాజన్న సిరిసిల్ల:**



జిల్లా వీర్నపల్లి మండల బంజేరు గ్రామానికి చెందిన గుగులోత్ రమేష్ కూతురు గుగులోత్ అమూల్య పదోవ తరగతి ఫలితాల్లో 10 జిపిఏ సాధించింది. మంగళవారం ప్రభుత్వం ప్రకటించిన పదోవ తరగతి ఫలితాల్లో కూతరు రాష్ట్ర స్థాయి ర్యాంక్ సాధించడం పట్ల తల్లిదండ్రులు గుగులోత్ రమేష్, రాధిక సంతోషం వ్యక్తం చేశారు.

## భోజనం రుచిగా లేదని భార్యను హత్య చేసిన కసాయి

**టి మీడియా, ఏప్రిల్ 30,హైదరాబాద్:**



వంట రుచి గా చేయడం లేదని భార్యను హత్య చేసిన ఘటన మేడ్చల్ జిల్లా బాచుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం ఉదయం దారుణం చోటుచేసుకుంది. భోజనం బాగోలేదని భార్య ను భర్త కొట్టించంపాడు. నిజాంపేట్ మున్సిపల్ కార్పోరేషన్ పరిదిలోని ప్రగతి బిల్డింగ్ వద్ద ఈ ఘటన జరిగింది. మధ్య ప్రదేశ్ కు చెందిన భార్య భర్తలు కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నా రు. వంట బాగోలేదని భార్య రవినాదూబే(26)ని భర్త ఇటుకతో కొట్టాడు. తలకు బలమైన గాయాలు కావ దంతో భార్య ఘటనా స్థలంలోనే చనిపోయింది. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని శవ పరీక్షల నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు

## నేవీ చీఫ్‌గా బాధ్యతలు చేపట్టిన అడ్మిరల్ దినేష్ కె. త్రిపాఠి

**టి మీడియా, ఏప్రిల్ 30, న్యూఢిల్లీ :**



భారత నావికాదళం 26వ చీఫ్‌గా అడ్మిరల్ దినేష్ కె. త్రిపాఠి మంగళవారం బాధ్యతలు చేపట్టారు. నేవీ చీఫ్‌గా 40 ఏళ్లకు పైగా సేవలందించిన అడ్మిరల్ ఆర్.హరికుమార్ పదవీవిరమణ చేసిన సంగతి తెలిసిందే. సముద్ర ప్రాంతాల్లో ఇప్పటికే ఉన్న, భవిష్యత్తులో ఎదురయ్యే సవాళ్లు, ఎదురయ్యే ప్రతికూలతలను శాంతియుతంగా అరికట్టడానికి, కాని పక్షంలో యుద్ధాన్ని గెలవడానికి అవసరమైన కార్యాచరణతో నావికా దళం సిద్ధంగా ఉండాలని సూచించారు. ఆత్మనిర్భర భారత్ దిశగా భారత నావికాదళం చేస్తున్న ప్రయత్నాలను బలోపేతం చేస్తానని, వికసిత్ భారత్ ద్వారా నూతన సాంకేతికతలు, వికసిత్ భారత్ కోసం నూతన అన్వేషణలతో నేవీని దేశ అభివృద్ధిలో మూలస్తంభంగా మార్చేలా చేస్తానని అన్నారు. నేవీలో మానవ వనరులను అంటే పురుషులు, మహిళల నైపుణ్యాలను పెంచేందుకు, వారికి అత్యుత్తమ ఆయుధాలు అందించేందుకు, శిక్షణ, వృత్తిపరమైన వాతావరణం, పరిపాలనాపరమైన మద్దతును అందించడానికి తాను ప్రాధాన్యతనిస్తానని అన్నారు.

## కాలేజ్ పై చర్యలు తీసుకోవాలి

- గజరాజుల తిరుమలేష్

**టీ మీడియా, ఏప్రిల్ 30, వనపర్తి బ్యూరో :**



అధిక ఫీజులు వసూలు చేస్తున్న ఎస్డిఎం కాలేజ్ ఆఫ్ లా చర్యలు తీసుకోవాలి గజరాజుల తిరుమలేష్ డిమాండ్ చేశారు. వనపర్తి పట్టణంలో పీర్లగుట్టలో నూతనంగా ఏర్పడిన ఎస్డిఎం కాలేజ్ ఆఫ్ లా ఎటువంటి అనుమతులు లేకుండా కాలేజీ నడుస్తున్న యూనివర్సిటీ అధికారులు తనిఖీలు చేయకుండానే అనుమతులు ఇచ్చి, విద్యార్థులతో డెవలప్మెంట్ ఫీజు పదివేల రూపాయలు అటెండెన్స్ ఫీజు మరియు ఇతర రకరకాల పేర్లతో ఫీజులు విద్యార్థులతో వసూలు చేయడం జరిగింది అక్రమంగా వసూలు చేస్తున్న ఫీజులను నియంత్రించాలంటే కాలేజీ ఎదుట ఆందోళన చేసిన విద్యార్థులను అదుపు చేయడం కోసం పోలీసులను రావడం జరిగింది సమస్యను పరిష్కరించాలంటూ స్టేషన్లో ఫిర్యాదు ఇవ్వడం జరిగింది ఈ కార్యక్రమంలో వారికి మద్దతుగా 24 వ వార్డు బిజెపి కౌన్సిలర్ అభ్యర్థి గజరాజుల తిరుమలేష్ లా కాలేజ్ స్టూడెంట్ కళ్యాణ్, గోపాలకృష్ణ,శరత్ గౌడ్, తదితర విద్యార్థులు పాల్గొనడం జరిగింది.

## గుర్తుతెలియని మృతదేహానికి అంత్యక్రియలు

- ఆర్థిక సహకారం అందించిన పృథ్వీరాజ్

**టీ మీడియా ,ఏప్రిల్ 30,.పటాన్చెరు:**



పట్టణంలోని కోటక్ మహేంద్ర బ్యాంక్ సమీపంలో యాచకుడు ఉండేవాడు, అతనికి ఆరోగ్యం బాగలేక, అక్కడ పడి ఉన్న అతడిని స్థానికులు సహకారంతో ప్రభుత్వ హాస్పిటల్ లో చేర్పించడం జరిగింది. సుమారు 36 రోజులు నుంచి ఆస్పత్రిలో చికిత్స పొంది, మూడు రోజుల క్రితం మృతి చెందడం జరిగింది. ఇతనికి సంబంధించిన వివరాల కోసం పోలీసులు వివిధ పోలీస్ స్టేషనులకు లుక్ అవుట్ నోటీసులు జారీ చేయగా, అతనికి సంబంధించిన వివరాలు ఏవి తెలియలేదు దీంతో ఎం డి ఆర్ ఫౌండేషన్ సమాచారం అందించగా మృతదేహానికి అంతక్రియలు ఎం డి ఆర్ ఫౌండేషన్ ప్రెసిడెంట్ మధు అంత్యక్రియలకు నిర్వహించడం జరిగింది. అలాగే అంత్యక్రియలకు ఎం డి ఆర్ ఫౌండేషన్ కో-ఫౌండర్ పృథ్వీరాజుఆర్థిక సహకారం అందించడం జరిగింది.

## పదిలో అజ్జకొల్లు దే అగ్రస్థానం

- 96% ఉత్తీర్ణతతో విద్యార్థుల ప్రభంజనం

**టీ మీడియా, ఏప్రిల్ 30, వనపర్తి బ్యూరో :**





పదవ తరగతి ఫలితాలలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అజ్జకొల్లు మదనపురం మండలంలో మొదటి స్థానం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అజ్జకొల్లు నుంచి 25 మంది విద్యార్థులు పరీక్ష రాయగా 24 మంది ఉత్తీర్ణులై 96% తో మదనాపురం మండలంలో మొదటి స్థానంలో నిలిచింది. చదువులో తమకు ఎదురే లేదని, సత్తా చాటి ప్రభంజనం సృష్టించిన అజ్జకొల్లు విద్యార్థులు.జి అజిత్ కుమార్ గౌడ్ 8.8 జీపీఏ తో మండల టాపర్ గా నిలిచాడు. బి భవాని 8.7 జీపీఏతో రెండవ స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా గ్రామస్తులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాసైన విద్యార్థులకు అభినందనలు తెలుపుతూ, ఉపాధ్యాయుల కృషిని కొనియాడారు. ప్రధానోపాధ్యాయులు బి. కృష్ణ, ఉపాధ్యాయ బృందం విద్యార్థులను అభినందించారు. గత ఆరు సంవత్సరాలుగా, అన్నింటా అజ్జకొల్లు పాఠశాలను అగ్రస్థానంలో నిలిపి, విజయ పరంపర కొనసాగించడానికి – విశేష కృషి చేసిన ఉపాధ్యాయ బృందానికి విద్యార్థులకు, మాజీ ప్రధానోపాధ్యాయులు అతీక్ అహ్మద్ మనస్ఫూర్తిగా శుభాకాంక్షలు తెలిపారు.

## 90.4% శాతం ఉత్తీర్ణత

**టి మీడియా, ఏప్రిల్ 30,మోర్తాడ్:**




మండలంలోని ఎనిమిది ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మొత్తం 235 మంది విద్యార్థులకు గాను 221 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు మండల విద్యాశాఖ అధికారి ఆంధ్రయ తెలిపారు. జెడ్ పి హెచ్ ఎస్ దొనకల్, జడ్.పి.హెచ్.ఎస్ శెట్పల్లి, జడ్.పి.హెచ్.ఎస్ సుంకేట్, గౌట్ హైస్కూల్ మోర్తాడ్ 100% ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. పాఠశాల చెందిన జే వర్షిత 9.8 సుంకేట్, శెట్టిపల్లి పాఠశాల చెందిన నందిత 9.8 సాధించినట్లు తెలిపారు. మండలంలోని రెండు ప్రైవేట్ పాఠశాలలో 100% ఉత్తీర్ణత సాధించగా నవోదయ పాఠశాల చెందిన ఆదిభ ఫిర్దోస్ 10 బై 10 మార్కులు సాధించినట్లు తెలిపారు.

## గొంతు కోసుకుని...
## ఇద్దరు చిన్నారులతో సహా డాక్టర్ ఫ్యామిలీ సూసైడ్

**టి మీడియా, ఏప్రిల్ 30, విజయవాడ :**



ఏం కష్టం వచ్చిందో ఏమో తెలియదు గానీ.. ఓ డాక్టర్ తనతోపాటు మొత్తం కుటుంబం సహా ఆత్మహత్యకు పాల్పడ్డడం కలకలం రేపింది. మృతుల్లో భార్యా భర్త, ఇద్దరు పిల్లలు, ఒక వృద్ధురాలు ఉన్నట్లు గుర్తించారు. ఈ దారుణ ఘటన విజయవాడలోని గురునానక్ నగర్‌లో మంగళవారం (ఏప్రిల్ 30) వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకెళ్తే.. సిటీలోని గురునానక్ నగర్ నివాసముంటున్న ప్రముఖ ఆర్థోపెడిక్ డాక్టర్ శ్రీనివాస్ (40) కుటుంబ సభ్యులను హత్య చేసి అనతరం ఆత్మహత్య చేసుకున్నట్టు సమాచారం. ఈ ఘటనలో డాక్టర్ శ్రీనివాస్‌తోపాటు ఆయన భార్య ఉష (38) , ఇద్దరు పిల్లలు శైలజ (9), శ్రీహన్ (8), తల్లి రమణమ్మ (65) మరణించారు. ఆత్మహత్యకు ముందు డాక్టర్ శ్రీనివాస్ సూసైడ్ నోట్ రాసినట్లు పోలీసులు గుర్తించారు. ఆ సూసైడ్ నోట్ ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం ఉదయం వారి పనిమనిషి ఇంటికి వచ్చి చూడగా.. బాల్కనీలో డాక్టర్ శ్రీనివాస్ ఉరివేసుకుని కనిపించారు. భయభ్రాంతులకు గురైన ఆమె వెంటనే కేకలు వేస్తూ చుట్టు పక్కల వారిని పిలిచింది. అనంతరం పోలీసులకు కూడా సమాచారం అందించారు.పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని పరిశీలించారు. ఘటన స్థలానికి వచ్చిన పోలీస్ కమిషనర్ రామకృష్ణ అక్కడ పరిస్థితిని పరిశీలించారు. ఇంటి లోపల శ్రీనివాస్ భార్య, ఇద్దరు పిల్లలు, తల్లి మృతదేహాలు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. మృతులందరి గొంతులు కోసి ఉన్నట్లు పోలీసులు తెలిపారు. శ్రీనివాస్ కుటుంబం డెత్ కేసు ఆత్మహత్యా లేక హత్యా అనే కోణంలో పోలీసులు విచారణ చేపట్టారు. క్లూస్ టీమ్, డాగ్ స్క్వాడ్ తో విచారణ చేపట్టారు. 1996 ఎంబీబీఎస్ బ్యాచ్‌కు చెందిన డాక్టర్ శ్రీనివాస్ గుంటూరు మెడికల్ కళాశాలలో ఎంబిబిఏస్ చదివారు. ఏడాది క్రితం డాక్టర్ శ్రీనివాస్ శ్రీజ ఆసుపత్రిని ప్రారంభించారు. అయితే ఆసుపత్రి కారణంగా గత కొంతకాలంగా ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆసుపత్రి సరిగా నడవటం లేదని ఆందోళనతో శ్రీనివాస్ డిప్రెషన్‌కు గురయ్యారు. ఈ క్రమంలో రెండు నెలల క్రితం ఆసుపత్రిని వేరే వారికి అప్పగించారు. ఆసుపత్రి వల్ల నష్టపోయినట్లు తెలుసు తప్ప.. డిప్రెషన్ లో ఉన్నట్టు తెలియదని తెలిస్తే సాయం చేసే వాళ్ళమని శ్రీనివాస్ క్లాస్ మెట్స్ డాక్టర్లు భగవాన్, డాక్టర్ మాధవి ఆవేదన చెందారు.

## జిల్లా పరిషత్ స్కూల్స్‌లో వంద శాతం పాస్..

- 6 పాఠశాలల్లో జీరో ఉత్తీర్ణత

**టి మీడియా, ఏప్రిల్ 30, హైదరాబాద్, ఏప్రిల్ 30:**



తెలంగాణ పదో తరగతి ఫలితాల్లో 91.31 శాతం ఉత్తీర్ణత నమోదైంది. రాష్ట్రంలోని మొత్తం పాఠశాలల్లో 3927 స్కూల్స్ 100 శాతం ఉత్తీర్ణత నమోదైంది. అన్ని జిల్లా పరిషత్ స్కూల్స్ వంద శాతం ఉత్తీర్ణత నమోదైంది. గతేడాది 25 పాఠశాలల్లో జీరో ఉత్తీర్ణత శాతం నమోదు కాగా.. ఈ సారి మాత్రం 6 స్కూల్స్‌లో మాత్రమే సున్నా ఉత్తీర్ణత శాతం వచ్చింది.తెలంగాణ పదో తరగతి ఫలితాలను ఇక్కడ నేరుగా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.వాటిల్లో 4 ప్రైవేట్ స్కూల్స్ ఉండగా.. 2 ఎయిడెడ్ స్కూల్స్ ఉన్నాయి. వంద శాతం ఉత్తీర్ణత నమోదు అయిన పాఠశాలల్లో.. జిల్లా పరిషత్ 1347, గవర్నమెంట్ 37, ప్రైవేట్ స్కూల్స్1814 స్కూల్స్ ఉన్నాయి. కేజీబీవీ స్కూల్స్, మోడల్ లలో కూడా 100 శాతం ఉత్తీర్ణత నమోదైంది. తెలంగాణ గురుకుల పాఠశాలల్లో 98.71 శాతంతో అత్యధికంగా ఉత్తీర్ణత పొందాయి.అలాగే రెసిడెన్షియల్, బీసీ వెల్ఫేర్ రెసిడెన్షియల్, సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్, ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్, మైనారిటీ రెసిడెన్షియల్, మోడల్ స్కూల్స్, కేజీబీవీ పాఠశాలల్లో ఈ ఏడాది సరాసరి కంటే అధికంగా ఉత్తీర్ణత సాధించాయి. ఆశ్రమ్, ఎయిడెడ్, జడ్పీ, గవర్నమెంట్ పాఠశాలల్లో 91.31 శాతం కంటే తక్కువ ఉత్తీర్ణత సాధించాయి. ఇక ఈ ఏడాది కేవలం 6 పాఠశాలల్లో మాత్రమే జీరో శాతం ఫలితాలు వచ్చాయి. గతేడాది 25 పాఠశాలల్లో జీరో ఉత్తీర్ణత శాతం నమోదు అయ్యింది. ఈ సారి సున్నా ఉత్తీర్ణత శాతం వచ్చిన 6 స్కూల్స్‌లో.. 4 ప్రైవేట్ స్కూల్స్ ఉండగా.. 2 ఎయిడెడ్ స్కూల్స్ ఉన్నాయి.

## పలువురిపై కత్తితో దాడి .. నిందితుని అరెస్ట్

**టి మీడియా, ఏప్రిల్ 30, లండన్ :**



కత్తితో పలువురిపై దాడి చేసిన ఓ వ్యక్తిని తూర్పు లండన్‌లోని హైనాల్ట్ నుండి అదుపులోకి తీసుకున్నట్లు మెట్రోపాలిటన్ పోలీసులు తెలిపారు. ఉదయం 7 గంటలకు ఓ వాహనం ఇంటిలోకి దూసుకువెళ్లినట్లు సమాచారం అందిందని, ఆ ఇంట్లోని వ్యక్తులు కత్తి పోట్లకు గురయ్యారని అన్నారు. ఆ సమయంలో అనుమానితుడు ఇద్దరు పోలీస్ అధికారులు సహా మరికొందరిపై దాడికి దిగాడని ఓ ప్రకటనలో పేర్కొన్నారు.నిందితుని దాడిలో ఐదుగురు వ్యక్తులకు తీవ్ర గాయాలయ్యాయని, వారిని ఆస్పత్రికి తరలించినట్లు లండన్ అంబులెన్స్ సర్వీస్ పేర్కొంది. ఘటనా స్థలం నుండి నుండి నిందితుడిని అదుపులోకి తీసుకున్నామని ఉన్నతాధికారి తెలిపారు. ఈ ఘటనకు ఉగ్రదాడితో సంబంధం లేదని అన్నారు. ఈ ఈ ఘటన గురించి విని తాను దిగ్భ్రాంతికి గురయ్యానని లండన్ మేయర్ తెలిపారు. మెట్రో పోలీస్ కమిషనర్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నానని చెప్పారు.అధికారిక సమాచారం ప్రకారం.. 2023లో 14,577 కేసులతో లండన్‌లో కత్తితో దాడి కేసులు 20 శాతం పెరిగాయి. మహమ్మారికి ముందు 2020 మార్చిలో ఉన్న స్థాయిల కన్నా ఒకశాతం తక్కువ. ఇంగ్లండ్, వేల్స్‌లో కత్తితో దాడి కేసులు ఏడు శాతం పెరిగి 49,489కి చేరగా, అత్యధికంగా మెట్రోపాలిటన్ ప్రాంతంలో 29 శాతం నమోదయ్యాయని జాతీయ గణాంకాల అధికారి తెలిపారు.

## పోలీస్ శాఖకు చేసిన సేవలు ఎంతో అభినందనీయం

- జిల్లా ఎస్పీ రక్షిత కే మూర్తి

**టీ మీడియా, ఏప్రిల్ 30, వనపర్తి బ్యూరో :**



శేష జీవితాన్ని కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా గడపాలి. అధికారులకు, సిబ్బందికి ఎలాంటి సమస్యలు తలెత్తినా ఎల్లప్పుడూ అండగా ఉంటా అని జిల్లాఎస్పీ రక్షిత కే మూర్తి అన్నారు. వనపర్తి జిల్లా పానగల్ పోలీస్ స్టేషన్ లో పనిచేసిన పోలీస్ కానిస్టేబుల్ దొడ్డ పద్మనాభ రెడ్డి, పిసి 1295 1989 బ్యాచ్ లో కానిస్టేబుల్ గా ఎంపికై 35 సంవత్సరాల 3 నెలల 27 రోజులు సర్వీసు పోలీసు శాఖ లో అమూల్యమైన సేవలు అందించి పదవి విరమణ సందర్భంగా ఎస్పీ కార్యాలయంలో ఆత్మీయ వీడ్కోలు ఏర్పాటు చేసి జిల్లా ఎస్పీ రక్షిత కె మూర్తి పూలమాలలు వేసి శాలువలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పదవీ విరమణ ప్రతి ఒక ఉద్యోగికి తప్పదని, ఉద్యోగంలో ఉన్నపుడు చేసిన సేవలే ఉద్యోగాణాంతరం కూడా వ్యక్తి గుర్తుండేలా మంచి పేరు ప్రఖ్యాతలు తెస్తాయని, పదవి విరమణ పొందుతున్న పద్మనాభ రెడ్డి సుదీర్ఘ కాలంగా విధులు నిర్వహించి 37 సంవత్సరాల పై చిలుకు సర్వీస్ పూర్తి చేసుకుని చేసిన సేవను మరువమని, పోలీస్ శాఖలో ఎంతో పని ఒత్తిడితో విధులు నిర్వర్తించి, ప్రజా రక్షణ కోసం వీరు పోలీస్ శాఖకు చేసిన సేవలు ఎంతో అభినందనీయమని ఎస్పీ అన్నారు. విధి నిర్వహణలో పగలనక, రాత్రనక, పండగల సమయంలో భార్యా, పిల్లలకు దూరంగా ఉండి డ్యూటీ చేసినారు. పదవి విరమణ చేసిన మీరు ఇకపై కుటుంబ సభ్యులతో తమ శేష జీవితాన్ని ఆనందంగా గడపాలని సూచించారు. తమ ఆరోగ్యాల పట్ల తగు జాగ్రత్తలను తీసుకోవాలని కోరారు. పదవీ విరమణ పొందిన కానిస్టేబుల్ కు ప్రభుత్వం నుంచి రావాల్సిన అన్ని రకాల ఆర్థిక ప్రయోజనాలను త్వరితగతిన అందేలా చర్యలు తీసుకోవాలని సెక్షన్ సూపరిటెంట్ ను ఆదేశించారు. మీకు ఎలాంటి సమస్యలు తలెత్తినా పోలీసు శాఖ తరపున ఎల్లప్పుడూ అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ శ్రీ రామదాసు తేజ , అడిషనల్ ఎస్పీ శ్రీ వీరారెడ్డి , వనపర్తి సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీ నాగభూషణం, రిజర్వు ఇన్స్పెక్టర్లు, శ్రీనివాస్, అప్పలనాయుడు, పానగల్ ఎస్ఐ వేణు, సూపరింటెండెంట్ లు ఇంతియాజ్, అశోక్ శెట్టి, రాజేందర్ పాల్గొన్నారు.

## వ్యక్తి దారుణ హత్య

**టి మీడియా, ఏప్రిల్ 30,వేములవాడ:**



సిరిసిల్ల జిల్లా వేములవాడలి లోఓ వ్యక్తిదారుణ హత్యకు గురయ్యాడు. ఈ విషాదకర సంఘటన వేములవాడ పట్టణ శివారులోని చెక్కపల్లిలో మంగళవారం ఉదయం చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వేములవాడ రూరల్ ఎంపీ పీ బంధ మల్లేశానికి చెందిన వ్యవసాయ భూమిలో కూలీగా పనిచేస్తున్న ఇద్దరు వ్యక్తుల మధ్య గొడవ జరిగింది. ఆవేశానికి గురైన ఓ వ్యక్తి పక్కనే ఉన్న పారతో మర్రిపల్లి రాజయ్య (64) తలపై దాడి చేయడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు జూపల్లి మండ లం తెలుకుంటపల్లి వాసిగా గుర్తించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరు కొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం ప్రభుత్వ దవాఖాన కు తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది..

## బీఆర్ఎస్కి తీరని లోటు

- మాజీ మంత్రిసింగిరెడ్డి నిరంజన్ రెడ్డి

**టీ మీడియా, ఏప్రిల్ 30, వనపర్తి బ్యూరో :**



వనపర్తి పట్టణం హరిజనవాడ 21 వ వార్డు టిఆర్ఎస్ పార్టీ వార్డు కార్యదర్శి గంధం బాలరాజు మరణం తీరనిలోటని ఆ వార్డులోని పార్టీకి చేసిన సేవ మరువలేమన కొనియాడారు. గంధం బాలరాజు మరణ వార్త తెలిసిన వెంటనే బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి బాలరాజు మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి , కుటుంబాన్ని ఓదారుస్తూ ధైర్యంగా ఉండాలని, పార్టీకి పనిచేసిన ప్రతి కార్యకర్తను పేరుపేరున గుర్తించుకుంటామని అన్నారు. అంత్యక్రియల నిమిత్తం కుటుంబానికి ఆర్థిక సహాయం చేయడం జరిగింది. భవిష్యత్తులో కుటుంబానికి సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శి గంధం పరంజ్యోతి,బీఆర్ఎస్ పార్టీ అవార్డు ఇంచార్జి గంధం విజయకుమార్ 21 వ వార్డు బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు డి, తిరుపతయ్య, ఫజల్, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి చిట్యాల రాము,ఈరపోగు మన్యం అవార్డు ప్రజలు పాల్గొన్నారు.

## ఖని కళాకారులకు గోవాలో అవార్డులు

**టీ మీడియా, ఏప్రిల్, 30, గోదావరిఖని ప్రతినిధి**



గోదావరిఖనికి చెందిన పలువురు కళాకారులు గత సోమవారం గోవాలో జరిగిన ఒక కార్యక్రమంలో నేషనల్ ఐకాన్ అవార్డులు అందుకున్నారు. అంతర్జాతీయ నృత్య దినోత్సవాన్ని పురస్కరించుకొని స్నేహ ఆర్ట్స్ అకాడమీ ఏప్రిల్ 26 నుండి 29 వరకు గోవాలోని రవీంద్ర భవన్ లో నిర్వహించిన జాతీయ నృత్యోత్సవాలలో ఖనికి చెందిన కళాకారులు బోడకుంట వెంకటరాజం, సిరిపురం శ్రీనివాస్, తిప్పబత్తిని అంజిబాబు, మామిడిపల్లి రాజబాబు, నరాల తిరుమలయ్య, సీసీసీ కార్నర్ కు చెందిన గజెల్లి రాజలింగు, మండల రమేష్, జీడి శ్రీనివాస్, ముఖ్య అతిథిగా విచ్చేసిన గోవా మేయర్ బాబు కురాడి, సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు కొట్టే నాగరాజు చేతుల మీదుగా నేషనల్ ఐకాన్ అవార్డులను అందుకున్నారు. స్థానిక కళాకారులు గోవాలో అవార్డులు అందుకోవడంపట్ల గోదావరి కళా సంఘాల సమాఖ్య అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కనకం రమణయ్య, మాదరి వాసు, సోగాల వెంకటి తదితరులు అభినందనలు తెలిపారు.

## ఎంపీ ప్రజ్వల్‌పై సస్పెన్షన్ వేటు

**టి మీడియా, ఏప్రిల్ 30, బెంగళూరు:**



హాసన సిటింగ్ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణపై వచ్చిన లైంగిక వేధింపుల ఆరోపణలు కన్నడ రాజకీయాల్లో తీవ్ర దుమారం రేపుతున్నాయి. అదే సమయంలో జేడీఎస్ కీలక నిర్ణయం తీసుకుంది. మంగళవారం ప్రజ్వల్‌ను పార్టీ నుంచి సస్పెండ్ చేసింది. ఈ మేరకు పార్టీ కోర్ కమిటీ నిర్ణయం తీసుకుంది. అలాగే ఆయనకు షోకాజ్ నోటీసులు జారీ చేసింది. ఇదిలా ఉంటే..ఈ పరిణామానికి ముందు ప్రజ్వల్ బాబాయ్, మాజీ ముఖ్యమంత్రి హెచ్.డి. కుమారస్వామి మీడియాతో మాట్లాడారు. ఈ వివాదం వెనక కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ హస్తం ఉందని ఆరోపించారు. వెంటనే ఆయన్ను పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. "ఆ వీడియోల్లో ప్రజ్వల్ ముఖం కనిపిస్తోందా..? అవి అతడివేనన్న ఆధారం ఏంటి..? అయినా సరే నైతికత ఆధారంగా చర్యలు ఉంటాయి" అని వ్యాఖ్యానించారు. ఈ వ్యవహారంపై సిట్ దర్యాప్తు చేస్తోందన్న మాజీ సీఎం.. వీడియో క్లిప్పులు ఉన్న పెన్‌డ్రైవ్‌లు ఎక్కడి నుంచి వచ్చాయి? ఎవరు పంపిణీ చేశారనే విషయాలపైనా దర్యాప్తు సాగాలన్నారు.

## మెరిట్ విద్యార్థి మౌనికను సన్మానించి మాజీ మంత్రి

**టీ మీడియా, ఏప్రిల్ 30, వనపర్తి బ్యూరో :**



కేశంపేట పాతతాండా బి.అర్. ఎస్ గ్రామపార్టీ అధ్యక్షులు కేతావత్.రాములు లక్ష్మి కూతురు మౌనిక ఇంటర్ ఒకేషనల్ కోర్సులో 920మార్కులు సాధించింది. ఈ సందర్భంగా మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి విద్యార్థినిని ఇంటికి పిలిపించుకొని అభినందించి సన్మానించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదివితే అద్భుతాలు సాధిస్తారని అన్నారు. ఉన్నతంగా ఎదిగి ఊరికి ప్రజలకు సేవ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో విజయ్ కుమార్,మాణిక్యం, తిరుమల్, సర్పంచ్ గౌడానాయక్, మహేశ్వర రెడ్డి, జోహేబ్ హుస్సేన్, చిట్యాల.రాము పాల్గొన్నారు.

## వడదెబ్బకు వృద్ధుడు మృతి

**టి మీడియా, ఏప్రిల్ 30, టెక్కలి (శ్రీకాకుళం) :**



మండలం బన్నువాడ గ్రామానికి చెందిన పోలాకి.రామారావు (70) అనే వృద్ధుడు మంగళవారం వడదెబ్బకు గురై మఋతి చెందాడు. ఈరోజు ఉదయం గ్రామంలో పొలంకి వెళ్లిన సమయంలో ఒక్కసారిగా తీవ్ర అస్వస్థతకు గురైన రామారావు అపస్మారక స్థితికి చేరుకోవడంతో కుటుంబసభ్యులు హుటాహుటిన టెక్కలి జిల్లా ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. దీంతో కుటుంబంలో విషాదం నెలకొంది.

## పది ఫలితాల్లో మల్లార్ 100 శాతం

**టి మీడియా, ఏప్రిల్ 30,మల్లార్ రావు:**



తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా మంగళవారం రాష్ట్ర విద్యాశాఖ పదోవతరగతి పలితాలు విడుదల చేసిన నేపథ్యంలో మండలంలోని మొత్తం 165 విద్యార్థులు పరీక్షలకు హాజరైతే 165 మంది విద్యార్థులు ఉత్తీర్ణులై 100 శాతం సాధించారు.ఎడ్లపల్లి ఆదర్శ పాఠశాలలో 68 విద్యార్థులకు అందరూ ఉత్తీర్ణులై 100 శాతం సాధించారు. దుబ్బపేటలో కస్తూర్బా ఆశ్రమ పాఠశాలలో 25 మంది విద్యార్థులకు అందరూ ఉత్తీర్ణులై 100 శాతం సాధించారు.మల్లారం జిల్లా పరిషత్ పాఠశాలలో 17 మందికి అందరూ ఉత్తీర్ణులై 100 శాతం సాధించారు. వల్లే%శీ%కుంట జిల్లా పరిషత్ పాఠశాలలో 6 మందికి అందరూ ఉత్తీర్ణులై 100 శాతం సాధించారు.పెద్దతూ%శీ%డ్లలో 2 మందికి అందరూ ఉత్తీర్ణులై 100 శాతం సాధించారు.తాడిచెర్లలో 47 మంది విద్యార్థులకు 46 మంది ఉత్తీర్ణులై 100 శాతం సాధించారు.అయితే తాడిచెర్ల జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న తాండ్ర నక్షత్ర 9.5 జీపీఏ సాధించి మండల టాపర్ గా నిలిచింది.ఇందుకు నక్షత్రను పలువురు ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు అభినందించారు.

## వసతి గృహాలను తెరిచి ఉంచాలి..

**టి మీడియా, ఏప్రిల్ 30,డిచ్ పల్లి:**



తెలంగాణ యూనివర్సిటీ గిరిజన శక్తి ఆధ్వర్యంలో వేసవికాలంలో తెలంగాణ యూనివర్సిటీ లోని వసతి గృహాలను తెరిచి ఉంచాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ యూనివర్సిటీ గిరిజన శక్తి అధ్యక్షుడు శ్రీను రాథోడ్ అద్వర్యంలో యూనివర్సిటీ రిజిస్ట్రార్ కు మంగళవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యూనివర్సిటీలో చదివే విద్యార్థులు వివిధ పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న కారణంగా వేసవికాలంలో వారికి ఇబ్బంది కలగకుండా వసతి గృహాలను తెరిచి ఉంచాలని, అదేవిధంగా మెస్ బిల్లులు కూడా యూనివర్సిటీయే భరించాలని కోరారు. అంతేకాకుండా వైఫై, వాటర్ సౌకర్యాలను యధావిధిగా కొనసాగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు మోహన్ నాయక్, ప్రవీణ్ కుమార్, మౌసిన్, రాము తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలే 9.8 జీపీఏ ర్యాంక్ సాధన

**టి మీడియా, ఏప్రిల్ 30,మద్నూర్:**




ఉమ్మడి మండలంలో గల ప్రభుత్వ ప్రైవేటు ఉన్నత పాఠశాలలో చదువుకున్న 10వ తరగతి విద్యార్థిని విద్యార్థులు 2023 24 సంవత్సరంలో 10వ తరగతి పరీక్షల్లో ప్రైవేట్ పాఠశాలల కంటే ప్రభుత్వ పాఠశాలలో 9.8 జిపిఏ ర్యాంక్ సాధించారు. మద్నూర్ ఉమ్మడి మండలంలో ప్రైవేటు ప్రభుత్వ పాఠశాలను 16 ఉండగా వీటిలో చదువుకున్న విద్యార్థిని విద్యార్థులు ఉత్తీర్ణత శాతం జీపీఏ ర్యాంకు ఫెయిల్ అయిన వారి సంఖ్య ఏ పాఠశాలలో జిపిఏ ర్యాంకు సాధించిన వారి ముఖ్య పేర్లు ఎక్సెల్ సీట్లో పేర్కొనడం జరిగింది. పాఠశాలల వారీగా 10వ తరగతి చదివిన వారిలో విద్యార్థిని విద్యార్థుల సంఖ్య జిపిఏ ర్యాంకు ఉత్తీర్ణత శాతం పేర్కొనడం జరిగింది.

## మద్యం ప్రియుల గోడు తీర్చిన ఎక్సైజ్ శాఖ..

- సంబరాలు చేసుకున్న తాగుబోతుల సంఘం సభ్యులు

**టి మీడియా, ఏప్రిల్ 30, మంచిర్యాల:**



జిల్లా తాగుబోతుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు తరుణ్ చేసిన పోరాటం ఫలించింది. కూలింగ్ బీర్ల కొరతతో మద్యం ప్రియులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని.. మండు టెండల్లో మద్య ప్రియుల బాదలు తీర్చాలంటూ మంచిర్యాల ఐబీ నుండి మంచిర్యాల కలెక్టరేట్ వరకు పాదయాత్ర చేపట్టి ఎక్సైజ్ శాఖకు తన గోడు వెళ్లబోసుకున్నాడు మంచిర్యాల జిల్లా తాగుబోతుల సంఘం అధ్యక్షుడు.. దీంతో అతని పోరాటం 24 గంటల్లోనే ఫలించింది. మంచిర్యాల జిల్లావ్యాప్తంగా ఉన్న వైన్ షాపు, బార్లలో కింగ్ ఫిషర్ బీర్ల స్టాక్ అధికారులు అందుబాటులోకి తెచ్చారు. దీంతో పలువురు తాగుబోతులు సంబరాలు చేసుకున్నారు. తమ తరుపున పోరాటం చేసి తమ బీర్ల దాహం తీర్చిన తాగుబోతుల సంక్షేమ సంఘం మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు కొట్రంగి తరుణ్ ను శాలువాతో ఘనంగా సన్మానించారు తాగుబోతులుమంచిర్యాల జిల్లాతో పాటు కరీంనగర్ , జగిత్యాల, పెద్దపల్లి జిల్లాలో కింగ్ ఫిషర్ లైట్ బీర్లు దొరకడం లేదని, దీంతో తమ ఆరోగ్యాలు దెబ్బతింటున్నాయని తరుణ్ సోమవారం మంచిర్యాల జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ కు వినతిపత్రం సమర్పించారు. ఈ వార్త అన్ని సోషల్ మీడియా ప్లాట్ ఫాంలలో వ్యాపించి క్షణాల్లో రాష్ట్ర స్థాయి ఎక్సైజ్ శాఖకు చేరిందిఈ రకమైన వినూత్న నిరసన తొలి సారి కావడంతో సర్వత్రా చర్చకు దారి తీసింది. దీంతో వెంటనే స్పందించిన అధికారులు లైట్ బీర్ల కొరతకు వెంటనే చెక్ పెట్టారు. 24 గంటల్లోనే తమ కష్టాలు తీర్చిన అదికారులకు అభినందనలు తెలిపాడు తాగుబోతుల సంఘం అధ్యక్షుడు తరుణ్..

## అగ్నికి ఆహుతి అయిన గుడిసె వ్యవసాయ పరికరాలు

**టీ మీడియా, ఏప్రిల్ 30, ఓదెల:**



పెద్దపల్లి జిల్లా ఓదెల మండలం పోత్కపల్లి గ్రామంలో వంగ ఆయిలు కుమార్, వంగ రాజు, ఇద్దరు అన్నతమ్ములు కాగా, వారికి సంబంధించిన, వ్యవసాయ సామాగ్రి, ఇంటి వెనకాల, గుడిసె నిర్మించుకొని, బర్రెలు గొర్ల మరియు వ్యవసాయ పరికరాలు నిమిత్తం, నిర్మించుకోవడం జరిగింది, గుడిసెకు నిప్పు అంటుకోవడంతో, పూర్తి గుడిసె సామాన్లు, కాలిపోవడం జరిగింది, దీనిలో, రెండు,5 హెచ్ పి మోటర్లు, ఎడ్ల బండి, అల్యూమినియం వైరు, పీవీసీ పైపులు, స్ప్రే పంపులు,సైకిల్, పర్దలు,గుడిసె, వాసాలు మరియు కానీలు, పూర్తిగా ధ్వంసం అయ్యాయి, ఘటన స్థలాన్ని సందర్శించిన పొత్కపల్లి ఎస్ఐ అశోక్ రెడ్డి, అనంతరం, పూర్తిగా కాలిన తర్వాత, ఫైర్ ఇంజన్ రావడం జరిగింది,సుమారు 2,20,000 / ఆస్తి నష్టం జరిగినట్టుగా బాధితులు చెబుతున్నారు, ఫైర్ సిబ్బంది, రెండు లక్షల రూపాయల, ఆస్తి,నష్టం, జరిగినట్టుగా పంచనామా చేయడం జరిగింది, అధికారులు స్పందించి, తమకు న్యాయం చేయగలరని బాధితులు కోరుతున్నారు.

## దహన సంస్కారాల ఖర్చు నిమిత్తం ఆర్థిక సాయం

- డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి రెడ్డి రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు, ఏఐసీసీ కార్యదర్శి

**టీ మీడియా, ఏప్రిల్ 30, వనపర్తి బ్యూరో :**



శాఖాపురం గ్రామంలో చాకలి రాముడు కుమారుడు చాకలి నారాయణ అనారోగ్య రీత్యా మరణించిన విషయం గ్రామ కాంగ్రెస్ పార్టీ శ్రేణుల ద్వారా తెలుసుకున్న డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి రెడ్డి రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు వెంటనే స్పందించి వారి కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ వారి దహన సంస్కారాల ఖర్చు నిమిత్తం 5000 రూపాయలను గ్రామ కాంగ్రెస్ పార్టీ శ్రేణుల ద్వారా వారి కుటుంబానికి అందజేయాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వాడ శ్రీనివాస్ యాదవ్, మండల బిసి సెల్ కార్యదర్శి, తెలుగు మద్దన్న, చాకలి రాముడు, కంకల శ్రీను, కురువ శివుడు, ఉప్పరి వెంకటయ్య, మొగులన్న, ఉప్పరి లక్ష్మన్న, పుట్ట రాముడు, ఎనుముల మధు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం చేసిన డాక్టర్ జిల్లెల ఆదిత్య రెడ్డి

**టీ మీడియా, ఏప్రిల్ 21, వనపర్తి బ్యూరో :**



వనపర్తి జిల్లా కేంద్రంలోని 21వార్డులో గంధం బాలరాజు మరణించిన విషయాన్ని స్థానిక నాయకులు సమాచారం అందించగా ఏఐపిసి స్టేట్ కోఆర్డినేటర్ డాక్టర్ జిల్లెల ఆదిత్యరెడ్డి ఆర్థిక సహాయాన్ని స్థానిక నాయకులు చిట్టెమ్మ, డి శివ, శివ ఇతర నాయకుల ద్వారా మృతని కుటుంబానికి అందించడం జరిగింది. భవిష్యత్లో కూడా వారి కుటుంబానికి అండగా ఉంటాము అని ఆదిత్య రెడ్డి వారి ద్వారా చెప్పడం జరిగింది.

## మృతిని కుటుంబానికి ఆర్థిక సహాయం చేసిన ఎమ్మెల్యే తుడి మేగారెడ్డి

**టీ మీడియా, ఏప్రిల్ 30, వనపర్తి బ్యూరో :**



నాగరాల గ్రామానికి చెందిన చారగొండ కురుమయ్య మాజీ వార్డ్ మెంబర్ అనారోగ్య రీత్యా మంగళవారం ఉదయం 8 గంటలకు మరణించడం జరిగింది. ఇట్టి విషయం తెలుసుకున్న వనపర్తి నియోజకవర్గం ఎమ్మెల్యే తుడిమేగా రెడ్డి దృష్టికి తీసుకుపోగా మరణించిన కుటుంబానికి సానుభూతి తెలియజేస్తూ మేఘన చేయూత కింద ఆర్థిక సాయం చేయవలసిందిగా ఎమ్మెల్యే మెగా రెడ్డి నాయకులు ఆర్ నరేందర్ రెడ్డి కి తెలుపగా మరణించిన కుటుంబానికి ఆర్ నరేందర్ రెడ్డి చేతుల మీదుగా 5000 రూపాయలు మేఘన చేయూత కింద ఆర్థిక సాయం అందించడం జరిగింది. మృతుడి కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందని ప్రభుత్వం తరఫున కుటుంబాన్ని ఆదుకుంటామని నాయకులు ఆర్ నరేందర్ రెడ్డి హామీ ఇవ్వడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు చారగొండ ఆనంద్, కుమారి తిరుపతి, కేశపాక చందు, కుమారి కురుమూర్తి, బోగిని శివుడు, బాలకృష్ణ, నరసింహ తదితరులు పాల్గొనడం జరిగింది.

# అమలాపురం పోరు ఆసక్తికరం

**టి మీడియా, ఏప్రిల్ 30, అమలాపురం :**

అమలాపురంలో రాజకీయం రసవత్తరంగా మారింది. మొదట్లో టికెట్ల కేటాయింపుపై ఇటు అధికార పక్షం, అటు ప్రతిపక్ష పార్టీ సైతం జాప్యం చేశాయి. అన్ని స్థానాలనూ ప్రకటించినప్పటికీ అమలాపురం వద్దకు వచ్చేసరికి ఆచితూచి అడుగులు వేశాయి. ఎట్టకేలకు అధికార వైసిపి నుంచి టికెట్‌ను మంత్రి పినిపే విశ్వరూప్‌నకు కేటాయించగా, టిడిపి మాజీ ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావువైపు మొగ్గు చూపింది. కాంగ్రెస్ పార్టీ అయితాబత్తుల సుభాషిణిని బరిలో నిలిపింది. కోనసీమకు అంబేద్కర్ పేరును పెట్టడంతో చెలరేగిన అల్లర్లు రాజకీయ నాయకులకు తలనొప్పిగా మారాయి. ఈ అల్లర్లలో మంత్రి పినిపే విశ్వరూప్, ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకటసతీష్‌కుమార్ ఇళ్లకు ఆందోళనకారులు నిప్పు పెట్టిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో వందలాది మందిపై వైసిపి ప్రభుత్వం కేసులు నమోదు చేసింది. ఇళ్లను తగులబెట్టడంతో దళితులతోపాటు బిసి తరగతులవారూ రాష్ట్ర వ్యాప్తంగా పెద్దయెత్తున ఆందోళనలు చేపట్టారు. వారికి మద్దతుగా నిలిచారు. అనంతర కాలంలో ఈ కేసులను రాష్ట్ర ప్రభుత్వం ఎత్తివేస్తూ నిర్ణయం తీసుకుంది. ఈ గొడవల నేపథ్యంలో కొంత మంది దళిత నాయకులు వైసిపికి దూరంగా ఉన్నారు. కేసులను ఎత్తివేయడంతో ఎంపి మిథున్‌రెడ్డికి ప్రధాన నిందితునిగా ఉన్న బిసిల నాయకుడు వాసంశెట్టి సుభాష్ కృతజ్ఞతలు కూడా తెలిపారు. ఇదంతా రాజకీయంగా కలిసొస్తుందని భావించిన వైసిపికి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. అమలాపురం వైసిపిలో కీలకంగా ఉన్న నాయకుడు వాసంశెట్టి సుభాష్ ఎన్నికలు వచ్చేసరికి 'సైకిల్' ఎక్కారు. అంతేకాకుండా టిడిపి నుంచి టికెట్ సంపాదించి రామచంద్రపురం నుంచి ఎమ్మెల్యేగా ఇప్పుడు బరిలో నిలిచారు. ఈ ఘటనల నేపథ్యంలో సమీకరణలను లెక్కలు చూసుకున్న ప్రధాన పార్టీలు అమలాపురం అసెంబ్లీ స్థానానికి అభ్యర్థుల ఎంపికలో ఆచితూచి వ్యవహరించాయి. మొత్తంగా అమలాపురం అల్లర్ల ఘటనలు వైపికి మేలు కంటే కీడే ఎక్కువ చేసిందని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. ఈ వ్యవహారంలో టిడిపి, జనసేనను సైతం తప్పుబడుతున్నారు. మొదట్లో అంబేద్కర్ పేరు కోసం ర్యాలీల్లో పాల్గొన్న టిడిపి, జనసేన తరువాత ప్లేటు మార్చడంపైనా పలు విమర్శలు వినిపిస్తున్నాయి.



### ప్రచారానికి పదును

నామినేషన్ల ఘట్టం కూడా పూర్తవ్వడంతో అభ్యర్థులు ప్రచారాన్ని ముమ్మరం చేశారు. వైసిపి అభ్యర్థి పినిపే విశ్వరూప్, కుటుంబ సభ్యులతో కలిసి ఇప్పటికే రెండు పర్యాయాలు నియోజకవర్గాన్ని చుట్టేశారు. ఇంటింటికీ వెళ్లి మరీ ఓట్లను అభ్యర్థిస్తున్నారు. దళిత, బిసి సంఘాల నాయకులతో ఆత్మీయ సమ్మేళనాలను నిర్వహించి గెలుపునకు బాటలు వేసుకుంటున్నారు. మరోవైపు టిడిపి అభ్యర్థి అయితాబత్తుల ఆనందరావు కూడా ప్రచారంలో వేగాన్ని పెంచారు. కూటమిలో భాగంగా ఉన్న జనసేన, బిజెపి నాయకులను కలుపుకుంటూ ప్రచారం నిర్వహిస్తున్నారు.

### కాంగ్రెస్‌లో నూతనోత్సాహం

దశాబ్ద కాలం అనంతరం అమలాపురంలో మళ్లీ కాంగ్రెస్ జెండాలు రెపరె పలాడుతున్నాయి. అమలాపురం నుంచి ఇండియా వేదిక బలపర్చిన అభ్యర్థి అయితబత్తుల సుభాషిణి కాంగ్రెస్ నుంచి పోటీలో ఉన్నారు. వేదికలో ఉన్న సిపిఎం, సిపిఐ, ఆప్, ఇతర పార్టీలు ఆమెకు మద్దతుగా నిలిచాయి. నామినేషన్లకు వేదిక పార్టీల నాయకులు పెద్దయెత్తున తరలి వచ్చారు. అంతేకాకుండా ఇటీవల వేదిక తరపున సమావేశాన్ని సైతం నిర్వహించారు. వేదికలో ఉన్న అన్ని పార్టీలూ సభాషిణి గెలుపునకు కృషి చేయాలని ఏకగ్రీవంగా తీర్మానించారు. అలాగే ప్రచారాన్ని సైతం ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. పదేళ్ల కాలంలో టిడిపి, వైసిపి, బిజెపి చేసిన అన్యాయాన్ని వివరిస్తూ ముందుకు సాగుతున్నారు. దశాబ్ద కాలంగా స్థిరంగా ఉన్న కాంగ్రెస్ నాయకులు ఇప్పుడు తిరిగి జెండాలు పట్టడంతో కాంగ్రెస్ శిబిరంలో నూతనోత్సాహం కనిపిస్తుంది.

# సత్తెనపల్లిలో ఢీ అంటే ఢీ

- ప్రధాన పోటీలో అంబటి, కన్నా, చంద్రపాల్
- విజయంపై ఎవరి ధీమా వారిది !

**టి మీడియా, ఏప్రిల్ 30, గుంటూరు :**



పల్నాడు జిల్లా సత్తెనపల్లి అసెంబ్లీ నియోజకవర్గంలో తాజా ఎన్నికలు రసవత్తరంగా మారాయి. రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు (వైసిపి), మాజీ మంత్రి కన్నా లక్ష్మీనారాయణ (టిడిపి), చంద్రపాల్ (ఇండియా బ్లాక్ తరపున కాంగ్రెస్ అభ్యర్థి) పోటీ చేస్తున్నారు. మిగతా అభ్యర్థులు రంగంలో ఉన్నా.. ప్రధాన పోటీ వీరి మద్యే జరగనుంది. . వామపక్షాలు %ß%ప్రధానంగా సిపిఎంకు బలమైన కేంద్రమిది. సత్తెనపల్లి కేంద్రంగా రైతు, వ్యకాసతో పాటు అనేక సామాజిక ఉద్యమాలు జరిగాయి. గతంలో ఇక్కడి నుండి సిపిఎం తరపున శాసనసభకు ప్రాతినిధ్యం లభించింది.

కన్నా లక్ష్మీనారాయణ 1989 నుంచి 2009 వరకు ఐదుసార్లు ఎమ్మెల్యేగా, 14 ఏళ్ల పాటు మంత్రిగా పనిచేశారు. రాష్ట్ర విభజనానంతరం ..2014లో.ఆయన గుంటూరు పశ్చిమ నుంచి పోటీ చేసి ఓడిపోయారు. ఆ తరువాత 2018లో కాంగ్రెస్‌కు రాజీనామా చేసి%ß% బిజెపిలో చేరి రాష్ట్ర అధ్యక్ష బాధ్యతలు నిర్వహించారు. 2019 ఎన్నికల్లో బిజెపి రాష్ట్ర అధ్యక్షులుగా పనిచేస్తూనే నర్సరావుపేట లోక్‌సభ నుంచి పోటీ చేసి ఓడిపోయారు. 2020లో బిజెపి రాష్ట్ర అధ్యక్ష పదవి నుంచి కన్నాను తప్పించారు. తరువాత టిడిపిలో చేరారు. బిజెపి పట్ల మైనార్టీల్లో ఉండే భయం వల్ల .కన్నాకు వచ్చే ఓట్లకు గండి పడే పరిస్థితి ఉందని స్థానిక నేతలు చెపుతున్నారు. మాజీ మంత్రి కన్నా లక్ష్మీనారాయణకు జనసేన సానుభూతిపరుల ఓట్లు ఎక్కువగా లభిస్తాయని టిడిపి నాయకులు ధీమాగా ఉన్నారు. వైసిపి ప్రభుత్వ వ్యతిరేకతతో పాటు నియోజకవర్గంలో తనకు ఉన్న పట్టు వల్ల విజయం లభిస్తుందని కన్నా ధీమా వ్యక్తం చేశారు.

మంత్రి అంబటి రాంబాబు 1989లో కాంగ్రెస్ పార్టీ నుంచి రేపల్లే ఎమ్మెల్యేగా గెలిచారు. 1994లో కాంగ్రెస్ అభ్యర్థిగా ఓడిపోయారు. 2004లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత ఎపిఐఐసి చైర్మన్‌గా పనిచేశారు. 2009లో వైఎస్ మృతి తరువాత ఏర్పడిన వైసిపిలో చేరారు. వైసిపి నుంచి 2014లో మాజీ స్పీకర్ కోడెల శివ ప్రసాదరావు చేతిలో ఓడి%ß%.. 2019లో ఆయనపైనే గెలుపొందారు. 2022 ఏప్రిల్‌లో జలవనరుల శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. మంత్రిగా శాఖాపరంగా పెద్దగా పట్టు సాధించకపోగా, నియోజకవర్గంలో కూడా చెప్పుకోదగ్గ అభివృద్ధి పనులు జరగలేదనే విమర్శలు ఎదుర్కొంటున్నారు. రాజకీయంగా ప్రత్యర్థులపై మాటల దాడి చేయడంలో చురుకుగా వ్యవహరిస్తున్నారనే అపఖ్యాతిని మూటకట్టుకున్నారు. స్థానిక సంస్థలకు నిధులు ఇవ్వకుండా అధికారాలకు కత్తెర వేయడంతో ప్రజాప్రతినిధుల అసంతృప్తి, సహజంగా ఉండే ప్రభుత్వ వ్యతిరేకత, అంబటి నాయకత్వం పట్ల అసమ్మతి ప్రభావం కనిపిస్తోంది. అయినా ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలే తనను గెలిపిస్తాయని, సిఎం జగన్‌పై ప్రజల్లో విశ్వాసం తగ్గలేదని అంబటి చెపుతున్నారు. ఇండియా బ్లాక్ అభ్యర్థిగా కాంగ్రెస్ నుండి చుక్కా చంద్రపాల్ పోటీ చేస్తున్నారు. విద్యావంతుడు అయిన చంద్ర పాల్ తండ్రి పీటర్ పాల్ 1972లో జనరల్ సీటు అయిన ప్రత్తిపాడు నుంచి పోటీ చేసి గెలుపొందారు. అలాగే చంద్రపాల్ కూడా జనరల్ సీటులో ఇప్పుడు పోటీ చేస్తున్నారు. ప్రధాన పార్టీల ఓట్లు చీల్చడం ద్వారా వారి విజయావకాశాలను ప్రభావితం చేయ నున్నారు.

## కాళేశ్వరం డ్యామేజ్‌కు కారణం తెలుసా

- జ్యుడీషియల్ ఎంక్వైరీ లో అవకాశం

**టి మీడియా, ఏప్రిల్ 30, హైదరాబాద్ బ్యూరో:**



కాళేశ్వరంపై తెలంగాణ ప్రభుత్వం సీరియస్ గా ఉంది. కాళేశ్వరం స్థితికి గల కారణాలపై కారకులపై దృష్టి పెట్టింది. ఇప్పటి వరకు రూ. లక్ష కోట్ల వరకు ఖర్చు అయ్యిందని. కాళేశ్వరాన్ని వినియోగంలోకి తేవాలంటే మరో 50 వేల కోట్లు ఖర్చు చేస్తే తప్ప దాన్ని వినియోగంలోకి తేలేమని కాంగ్రెస్ ప్రభుత్వం స్పష్టం చేసింది. అయితే కాళేశ్వరం ప్రాజెక్టులో అతి కీలకమైన మేడిబడ్డ బ్యారేజ్ లోని ఏడవ బ్లాక్ లో పిల్లర్ నెంబర్ 19,20,21 కుంగిపోవటంతో డ్యాంలోని నీటిని మొత్తం కిందికి వదిలారు. అయితే 16 టీఎంసీల కెపాసిటీ ఉన్న మేడిగడ్డ బ్యారేజ్ ని నిరుపయోగం చేశారని ఇటు బి ఆర్ ఎస్ అంటే దానికి కారణం మీరే అని కాంగ్రెస్ అంటుంది. రానున్న వర్షాకాలంలో మేడిగడ్డ బ్యారేజ్‌ని వినియోగంలోకి తీసుకురావాలంటే దానికి ఎటువంటి రిపేర్లు చేయాలన్న నేషనల్ డ్యాన్స్ సేఫ్టీ అథారిటీ నిపుణుల కమిటీ ఇచ్చే సూచనల ఆధారంగా మాత్రమే ముందడుగు వేస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం అంటోంది. ఇప్పటికే ఎన్ డి ఎస్ ఎ ఎక్స్పర్ట్ కమిటీ రెండు సార్లు కాళేశ్వరం ప్రాజెక్టుని సందర్శించి నాలుగు నెలల్లోగా నివేదికను ఇవ్వబోతోంది. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం %చీణూాా% నిపుణుల కమిటీని మధ్యంతర రిపోర్ట్ లో రిపేర్లు చేసే అవకాశం ఉంటే మరమ్మత్తులు చేపట్టి వచ్చే సీజన్ కి రైతులకి అందుబాటులోకి దాంని తీసుకొస్తామని చెబుతోంది.

ఇక ఎన్ డి ఎస్ ఏ రిపోర్ట్ తో పాటు కాగ్ నివేదికలు, విజిలెన్స్ రిపోర్టు పరిగణలోకి తీసుకోవాలని భావించండి జ్యుడీషియల్ ఎంక్వయిరీ కమిషన్. కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించి న్యాయ విచారణ జరిపి ప్రాజెక్టు కుంగుబాటుకు కారణాలు, కారకులను తెల్చే పనిలో పడింది. అందుకోసం సుప్రీంకోర్టు మాజీ జస్టిస్ మొదటి లోక్పాల్ చైర్మన్ జస్టిస్ పినాకి చంద్రఘోషను నియమించింది. బాధ్యతలు చేపట్టిన పినాకి చంద్రగోస్ ఏప్రిల్ 25 26 27 తేదీల్లో తెలంగాణలో పర్యటించారు. మొదటి దశ విసిట్లో ప్రాజెక్టుకు సంబంధించిన డిజైన్లు డాక్యుమెంట్లు పరిశీలించారు. ఇప్పటికే 9 రకాల అంశాలపై సమాచారం కోరిన పినాకి చంద్రబోస్ పర్యటనలో భాగంగా మరింత సమాచారం కోరారు. మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి పినాకి చంద్ర ఘోష్ ని మర్యాదపూర్వకంగా కలిసి కాళేశ్వరం ప్రాజెక్టుపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ సమర్పించారు విచారణను వీలైనంత తొందరగా పూర్తి చేస్తానని అన్ని రిపోర్టులను పరిశీలించి నిపుణుల సలహాలు సలహార మేరకు విచారణ జరిపిస్తాననితెలిపారు. అయితే సామాన్య ప్రజలు కూడా తమ వద్ద కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించిన సమాచారం ఏదైనా ఉంటే నూత్రి ద్వారా అఫిడవిట్ని చేయించి దానికి సరైన ఆధారాలను జతపరిచి కమిషన్ కమిషన్ ని ఆశ్రయించవచ్చని తెలిపింది. ప్రజల వద్ద కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించి ఎటువ ంటి సమాచారం ఉన్న మే 30 లోగా కమిషన్ కి అందించవచ్చు. తొమ్మిది అంతకన్నా సాక్షాలను పోస్టు ద్వారా పంపించవచ్చు లేదా హైదరాబాద్లోని బి ఆర్ కే భవన్ లోని ఎనిమిదవ అంతస్తులో ఉన్న జ్యుడీషియల్ ఎంక్వయిరీ కమిషన్ ఆఫీసులో ఏర్పాటు చేసిన ప్రత్యేక బాక్సులో వేయవచ్చని తెలిపింది. ఇక విచారణకు ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం అందించడం కోసం అడిషనల్ ఇరిగేషన్ సెక్రెటరీ ప్రశాంత్ జీవన్ పాటిల్ నేతృత్వంలో 9 మంది సభ్యులతో ఒక నోడల్ టీం ఏర్పాటు చేసింది. ఇక పినాకి చంద్ర ఘోష్ కూడా ఒక ప్రత్యేక టీంని సెట్ చేశారు. ఈ టీంలో ఇరిగేషన్ కి సంబంధించిన ఎక్స్పర్ట్స్, సీనియర్ లాయర్, ప్రాజెక్ట్ డిజైన్ ఇంజనీరింగ్ ఎక్స్పర్ట్ ఇతర నిపుణులు ఉంటారు. జ్యుడీషియల్ కమిషన్ స్వతంత్రంగా విచారణ జరుపుతున్నప్పటికీ కాగ్ నివేదిక, విజిలెన్స్ రిపోర్ట్, మధ్యంతర ఉత్తర్వులను పూర్తిగా స్టడీ చేస్తామని జస్టిస్ పినాకి తెలిపారు. ఇక మొదటి విసిట్ లోనే కాళేశ్వరం ప్రాజెక్ట్ సందర్శిస్తారని అనుకున్నప్పటికీ ప్రాజెక్ట్ డాక్యుమెంట్ లు పూర్తిగా స్టడీ చేసిన తర్వాత రెండు విజిట్ లో కాళేశ్వరం ప్రాజెక్ట్ ని ప్రత్యక్షంగా సందర్శించనుంది జుడిషియల్ ఎంక్వైరీ కమిషన్. మూడు రోజుల పర్యటన ముగించుకుని ఏప్రిల్ 27న కోల్కత్తా తిరిగి వెళ్లిన జస్టిస్ పినాకి చంద్ర ఘోష్ వచ్చేవారం పర్యటనలో కాళేశ్వరం ప్రాజెక్టు సందర్శించనున్నారు. అయితే జ్యుడీషియల్ ఎంక్వయిరీ రిపోర్ట్ సమర్పించడానికి జూన్ 30న డెడ్లైన్ విధించడంతో 90 రోజుల్లో కాళేశ్వరం ప్రాజెక్టుపై న్యాయ విచారణ జరిపి కాళేశ్వరం దుస్థితికి కారణాలతో పాటు కారకులను ఎవరో కూడా కమిషన్ తేల్చనుంది.

## బెక్కెం చెరువును సందర్శించిన జూపల్లి అరుణ్

- జరిగిన నష్టానికి ప్రత్యామ్నాయం మార్గం చేస్తాం

**టీ మీడియా,ఏప్రిల్ 30, చిన్నంబావి**



మండల లోని బెక్కం చెరువును సందర్శించిన జూపల్లి అరుణ్ బాబు. గత వారం నుంచి బెక్కం చెరువు లో చేపలు నీళ్లు లేక చనిపోతున్నాయని దాని వల్ల మత్స్యకారులు తీవ్ర నష్టాన్నికి గురవుతున్నారని తెలుసుకొని స్వయం గా తానే వచ్చి చెరువు సందర్శించి మత్స్యకారులతో జరిగిన నష్టం గురించి మాట్లాడి తెలుసుకుని అధికారుల తో మాట్లాడి మీకు తగిన న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. మత్స్యకారులు మాట్లాడుతూ చెరువు లోతు లేకపోవడం తీవ్ర ఎండల వల్ల చెరువు లో నీరు తగ్గిపోవడం వల్ల చాపలు చనిపోతున్నాయని ఈ చెరువు పైనే 85 మత్స్యకార కుటుంబాలు ఆధారపడి ఉన్నాయని అధికారుల తో మాట్లాడి బెక్కెం చెరువును పూడిక తీసే ప్రయత్నం చేయాలని పూడిక తీస్తే కొంత వరకు నష్టం జరగకుండా ఉంటుందని వారు అన్నారు. ఈ కార్యక్రమం లో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొత్త కల్యాణ్ రావు,మందడి చిదంబర్ రెడ్డి,కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్ యాదవ్,రామచంద్ర రెడ్డి,ఈదన్న యాదవ్,రంజిత్ కుమార్,చెరువు సొసైటీ సభ్యులు బాలకిష్టయ్య, తిరుపాలు,మహేష్,శాంతయ్య, కళ్యాణ్,కాంగ్రెస్ నాయకులు,మత్స్యకార సభ్యులు,తదితరులు, పాల్గొన్నారు.

## ఉప్పునుంతల మండలంలో వంద శాతం ఉత్తీర్ణత

**టి మీడియా, ఏప్రిల్ 30, ఉప్పునుంతల:**



మంగళవారం వెలువడిన పదవ తరగతి ఫలితాల్లో ఉప్పునుంతల మండలంలో ఉన్న 6 స్కూల్స్ కు చెందిన 239 మందికి గాను 239 మంది విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధించారు. జడ్పిహెచ్ఎస్ ఉప్పునుంతల 56 మంది విద్యార్థులు కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల 48, జడ్పిహెచ్ఎస్ కంసానిపల్లి 18, జడ్పిహెచ్ఎస్ పెనిమిల్ల 21, జడ్పిహెచ్ఎస్ వెల్టూర్ 23, మహాత్మా జ్యోతిరావు పూలే తెలంగాణ బీసీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ 73 మంది విద్యార్థులు 9.0 పైనే 100కు 100 శాతం ఉత్తీర్ణత సాధించారు. మహాత్మ జ్యోతిరావు పూలే తెలంగాణ బీసీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ కు చెందిన విద్యార్థి త్రిష 10.0 అదే విదంగా జడ్పీహెచ్ఎస్ ఉప్పునుంతల పాఠశాలకు చెందిన సమీరా 9.8 తో మండల టాపర్లుగా రికార్డు సృష్టించినట్లు పాఠశాల ప్రదానోపాధ్యాయులు జటప్రోలు శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ఆయా పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు,మండల ప్రజలు అభినందించి ఆశీర్వదించారు.

## పదిలో విద్యా కుసుమాలు..

- గురుకుల విద్యార్థుల ప్రభంజనం..
- 11 మంది విద్యార్థులకు 10 జీపీఏ

**టి మీడియా, ఏప్రిల్ 30, తంగళ్ళపల్లి:**




పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో తంగళ్ళపల్లి మండల విద్యార్థులు విద్య కుసుమాలుగా అవతరించారు. మంగళవారం ప్రభుత్వం విడుదల చేసిన పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో గురుకుల విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. మండలంలోని నేరెళ్ల తెలంగాణ రెసిడెన్షియల్ స్కూల్ లోని పదో తరగతి విద్యార్థులు ఆరుగురు 10 జిపిఎ సాధించగా.. తెలంగాణ మైస్ స్కూల్ విద్యార్థులు ముగ్గురు 10 జిపిఏ సాధించారు. అలాగే టి ఎస్ మోడల్ స్కూల్ మండేపల్లి విద్యార్థులు ఇద్దరు 10 జిపిఏ సాధించడంతో మండల వ్యాప్తంగా మొత్తం 11మంది విద్యార్థులు 10 జిపిఎ సాధించి ప్రభంజనం సృష్టించారు. మండల వ్యాప్తంగా 8 పాఠశాలల్లో 100% ఉత్తీర్ణత సాధించారు. ఇ. హర్షిణి,ఎం. హవిలా, పి.జాగృతి, కె.జీవన, ఎన్.నేహా, డి.ప్రవని, ఎం.సంతోష్, ఇ. హర్షిత్,కె.నమిత,జి.అక్షయ,జి.రాజేశ్వరిని విద్యార్థులు 10 జిపిఎ సాధించారు. 10 జిపిఏ సాధించిన విద్యార్థిని విద్యార్థులను విద్యాశాఖ అధికారులు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు అభినందించారు. అలాగే వీరితోపాటు సిరిసిల్ల పట్టణంలోని శ్రీ చైతన్య పాఠశాలలో చదువుతున్న తంగళ్ళపల్లి మండలం పద్మనగర్ గ్రామానికి చెందిన విద్యార్థినీ మోర స్పందన 10 జిపిఏ సాధించారు. విద్యార్థినినీ పలువురు అభినందించారు.

## రేణుకా వర్సెస్ భట్టి..

- కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో రగడ

**టి మీడియా, ఏప్రిల్ 30, ఖమ్మం:**



లోక్ సభ ఎన్నికల వేళ కాంగ్రెస్‌లో వర్గ విభేదాలు భగ్గుమన్నాయి. ముగ్గురు మంత్రుల సాక్షిగా ఖమ్మం కాంగ్రెస్ శ్రేణులు బాహాబాహీకి దిగారు. ఖమ్మం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఖమ్మం పార్లమెంట్ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశానికి మంత్రులు భట్టి విక్రమార్క, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, ఎంపీ రేణుకా చౌదరి హాజరయ్యారు. ఈ క్రమంలో ఎంపీ రేణుకా చౌదరి వ్యాఖ్యలు ఈ గొడవకు కారణమైంది. దీంతో ముగ్గురు మంత్రుల సమక్షంలోనే రగడ కొనసాగింది. కొందరు పని తక్కువ చేస్తూ..ఎక్కువ ప్రచారం చేసుకుంటున్నారని, ఈ సమావేశానికి కొందరు మండల అధ్యక్షులు కూడా రాలేదని రేణుకా చౌదరి అన్నారు. అయితే రేణుకాచౌదరి ప్రసంగాన్ని అడ్డుకున్నారు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్గ వర్గీయులు.. దీంతో ఇరు వర్గాలు గొడవకు దిగాయి. కాంగ్రెస్ సమావేశం రేణుకా చౌదరి వర్సెస్ భట్టి విక్రమార్కగా మారిపోవడంతో అక్కడే ఉన్న మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి. తుమ్మల నాగేశ్వరరావు జోక్యం చేసుకొని కార్యకర్తలకు సర్ది చెప్పారు. ఖమ్మం కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్క కార్యకర్తపై ఉందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పేర్కొన్నారు. అందరూ సమిష్టి కృషితో పనిచేయాలని సూచించారు.

## కేజ్రీవాల్‌ను అరెస్టు.. ఈడీని నిలదీసిన సుప్రీంకోర్టు

**టి మీడియా, ఏప్రిల్ 30, న్యూఢిల్లీ:**



ఎక్సైజ్ పాలసీ కేసుకు సంబంధించిన మనీలాండరింగ్ కేసులో తన అరెస్టును వ్యతిరేకిస్తూ ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ వేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టులో మంగళవారంనాడు విచారణ జరిగింది. కేజ్రీవాల్‌ను అరెస్టు చేసిన సమయంపై స్పందించాల్సిందిగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్ ని అత్యున్నత న్యాయస్థానం ప్రశ్నించింది. "వ్యక్తి స్వేచ్ఛ అనేది చాలా ముఖ్యం" అని కోర్టు ఈ సందర్భంగా అభిప్రాయపడింది. లోక్‌సభ ఎన్నికలకు కొద్ది ముందు ఎందుకు తన క్లయింట్‌ను అరెస్టు చేయాల్సి వచ్చిందో చెప్పాలని కేజ్రీవాల్ తరఫు లాయర్ అభిషేక్ మను సింఘ్వి తన వాదనల సందర్భంగా ప్రశ్నించారు. దీనిపై అత్యున్నత న్యాయస్థానం స్పందిస్తూ, "స్వేచ్ఛ అనేది చాలా ముఖ్యమైన అంశం" అని స్పష్టం చేసింది. లోక్‌సభ ఎన్నికలకు ముందు అరెస్టుపై కేజ్రీవాల్ అడిగిన ప్రశ్నకు సమాధానం చెప్పాలని ఈడీ తరఫు న్యాయవాదిని జస్టిస్ సంజీవ్ ఖన్నా ఆదేశించారు. వచ్చే శుక్రవారం మధ్యాహ్నం లోగా స్పందన తెలియజేయాలని ఈడీకి గడువు విధించారు.

# కేసీఆర్ నాపై కేసు పెడితే
# కారు షెడ్డుకు పోయింది

## బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలని ఓడించాలి
## సీఎం రేవంత్ రెడ్డి



**టి మీడియా, ఏప్రిల్ 30,కరీంనగర్:**
జిల్లా జమ్మికుంటలో కాంగ్రెస్ జన జాతర సభలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలపై విరుచుకుపడ్డారు. ప్రధాని మోదీ, కేసీఆర్ టార్గెట్ గా నిప్పులు చెరిగారు. లోక్ సభ ఎన్నికల్లో ఆ రెండు పార్టీలకు బుద్ధి చెప్పాలని, చిత్తుచిత్తుగా ఓడించాలని పిలుపునిచ్చారు రేవంత్ రెడ్డి.కరీంనగర్ చైతన్యవంతమైన జిల్లా. ఎమ్మెస్సార్, చొక్కారావు లాంటి ఎందరో ఉద్దండులు ఈ జిల్లా నుంచి గెలిచారు. తెలంగాణ ఆకాంక్ష కోసం ఆనాడు మీరంతా కేసీఆర్ ను మూడు సార్లు గెలిపించారు. అదే కేసీఆర్ మా పాలమూరు గడ్డ మీదకు పోటీ కోసం వస్తే మేము కూడా గెలిపించాం. అదే కేసీఆర్ ను మీరు మొన్న ఓడించి బుద్ధి చెప్పారు. సెమీఫైనల్లో కేసీఆర్ ను ఓడించిన మీరు.. ఫైనల్లో బీజేపీని ఓడించి సూరత్ కు పంపించాలి.తెలంగాణకు మోదీ ఇచ్చిందేమీ లేదు. బండి సంజయ్ కరీంనగర్ కు తెచ్చిందేమీ లేదు. రైల్వే కోచ్ ఫ్యాక్టరీ సహా ఏ విభజన హామీని బీజేపీ నెరవేర్చలేదు. తెలంగాణ ఏర్పాటును అవమానించేలా మోడీ మాట్లాడారు. తలుపులు మూసి తెలంగాణ ఇచ్చారని, తల్లిని చంపి బిడ్డను బతికించారని మోడీ అవహేళన చేశారు. తెలంగాణను అవమానించేలా మోడీ మాట్లాడితే బండి సంజయ్ ఎందుకు మాట్లాడటం లేదు? తెలంగాణకు గాడిద గుడ్డు కూడా ఇవ్వలేదు. అందుకే బండికి ఓటేయాలా? ఆనాడు అరగుండు బండిని, పూర్తి గుండు అర్వింద్ ను ఓడించారు.అయోధ్యలో రాముని కల్యాణం జరగక ముందే అక్షింతలు ఇంటికి పంపించడమంటే సంప్రదాయాలను మంట గలిపి రామున్ని అవమానించారు. మనందరం రాముని భక్తులం కాదా.. మనం పండుగలు చేసుకోవడం లేదా? గ్రామ దేవతలకు కల్లు కోడి కొయ్యలేదా? హిందుత్వాన్ని ఓట్ల కోసం, వ్యాపారానికి వాడుకుంటున్నారు. దేవుని బొమ్మ చూపించి ఓట్లడుక్కునే నీచ రాజకీయాలు చేస్తున్నారు. గాంధీ, నెహ్రూ, అంబేద్కర్ లాంటి మహనీయుల నుంచి మేము దేశభక్తిని పునికి పుచ్చుకున్నాం.బీసీల రిజర్వేషన్ పెంచాలని, బీసీ జనగణన చేయాలని రాహుల్ చెప్పారు. దానికి అనుగుణంగా రాష్ట్రంలో చర్యలు చేపట్టాం. మీరు రిజర్వేషన్లు రద్దు చేయాలనుకుంటున్నారని నేను ఆరోపిస్తున్నా. అందులో భాగంగానే 400 సీట్లు కావాలంటున్నారు. 2/3 మెజార్టీ వస్తే.. ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లు రద్దు చేస్తారు. బీజేపీ బీసీ లెక్కలు వద్దంటోంది. ఎందుకు రిజర్వేషన్లు రద్దు చేయాలనుకుంటున్నారో మోడీ ఇక్కడికొచ్చి చెప్పాలి. బీజేపీ ఓడితేనే రిజర్వేషన్లు కొనసాగుతాయి.మనం గెలవాలంటే బీజేపీ ఓడాలి. సర్జికల్ స్ట్రైక్ చేసి రిజర్వేషన్లు రద్దు చేసేందుకు మోడీ సిద్ధమవుతున్నారు. ఈ మాట చెప్పినందుకే నాపై కేసులు పెట్టి పోలీసులను పంపారు. గతంలో కేసీఆర్ కూడా నాపై ఇలాంటి కేసు పెడితే కారు షెడ్డుకు పోయింది. అందుకే కారు పక్కన పెట్టి బస్సు యాత్ర చేస్తున్నారు. తిక్కలోడు తిరునాళ్లకు పోయినట్లుగా కేసీఆర్ యాత్ర ఉంది. పలు చోట్ల బీజేపీ, బీఆర్ఎస్ కుమ్మక్కయ్యాయి. ఇండియా కూటమిలోకి బీఆర్ఎస్ ను రానీయం. వాళ్ల గోడ మీద కాకి మా గోడ మీద వాలినా కాల్చి పడేస్తాం. రాబోయే ఎన్నికల్లో హంగ్ వస్తే తాము ప్రభుత్వంలో చేరతామని చెబుతున్నారంటేనే వారి కుమ్మక్కు రాజకీయాలు అర్థం చేసుకోవాలి. కేసీఆర్ కుట్రలు గమనించే కమ్యూనిస్టులు మాకు మద్ధతిచ్చారు.వచ్చిన నెల రోజుల్లోనే 30 వేల ఉద్యోగాలిచ్చాం. రామప్ప శివుని సాక్షిగా మరోసారి చెబుతున్నా. ఆగస్టు 15 లోగా రైతులకు రుణమాఫీ చేస్తా. మీ ఆకాంక్ష నెరవేరుస్తా.. కాంగ్రెస్ ను గెలిపించండి. వెలిచాల కుటుంబం ప్రజాసేవ చేసింది. లక్ష మెజార్టీతో రాజేందర్ రావును గెలిపించాలి" అని రేవంత్ రెడ్డి అన్నారు.

# జగనన్న సంక్షేమ ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి
## ఎమ్మెల్యే శిల్పా



**టీ మీడియా, ఏప్రిల్ 30, మహానంది:**
రానున్న ఎన్నికల్లో ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి సంక్షేమ ప్రభుత్వాన్ని ప్రజలందరూ ఆశీర్వదించాలని శ్రీశైలం నియోజకవర్గం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి అన్నారు.మంగళవారం మహానంది మండలం మజార గ్రామపంచాయతీ గాజులపల్లె, బసాపురం, ఆంజనేయ పురంలలో ఎమ్మెల్యే శిల్పా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ముందుగా వైసిపి నాయకులు కొండా మధుసూదన్ రెడ్డి, వడుగురి రామకృష్ణుడు,గజ్జ పెద్ద పకీరయ్య పూలమాలతో ఘనంగా సన్మానించి, స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శిల్పా మాట్లాడుతూ..పేద ప్రజల సంక్షేమం కోసం పనిచేసిన జగనన్న ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని, జగనన్న ముఖ్యమంత్రిగా ఉంటేనే పేద ప్రజల సంతోషంగా ఉంటారన్నారు.రాష్ట్రంలో కుల,మత, రాజకీయ పార్టీలకతీతంగా అర్హులందరికీ, సంక్షేమ పథకాలు అందజేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు.జగన్ మోహన్ రెడ్డి ఇదేళ్ల మంచి పరిపాలన దృష్టిలో పెట్టుకొని, ఫ్యాన్ గుర్తుకు ఓటేయ్యాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ పదో తరగతి ఫలితాలు విడుదల
## బాలికలే పై చేయి సాధించారు



**టి మీడియా, ఏప్రిల్ 30,హైదరాబాద్:**
తెలంగాణ పదో తరగతి ఫలితాలు విడుదలయ్యాయి. విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం ఫలితాలను విడుదల చేశారు. తెలంగాణలో దాదాపు 5 లక్షల మందికి పైగా విద్యార్థులు ఈ పరీక్షలు రాశారు. బాలికలే పై చేయి సాధించారు. ఫలితాలను %ఎంఎ్.వశ్రీఖఅస్త్రుఖు.ప్రశీజ.అఅ% లో చెక్ చేసుకోవచ్చు. 91.31 శాతం ఉత్తీర్ణత నమోదైంది.బాలికల ఉత్తీర్ణత శాతం 93.23 గా ఉంది. బాలుర ఉత్తీర్ణత శాతం 89.42గా నమోదైంది.నిర్మల్ జిల్లా 99.09 శాతం ఉత్తీర్ణతతో అగ్రస్థానంలో నిలిచింది.వికారాబాద్‌లో అత్యల్పంగా ఉత్తీర్ణత శాతం 91.31 శాతంగా నమోదైంది.3వ స్థానంలో రాజన్న సిరిసిల్ల జిల్లాహైదరాబాద్‌లో ఉత్తీర్ణత శాతం 91.31.3,927 పాఠశాలల విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణతను సాధించారుతెలంగాణ గురుకులాల్లో 98.71 శాతం ఉత్తీర్ణత.ఆరు ప్రైవేటు పాఠశాలల్లో సున్నా శాతం ఉత్తీర్ణత.జిల్లా పరిషత్ గవర్నమెంట్ పాఠశాలల్లో 91.31 శాతం ఉత్తీర్ణతపదో తరగతి అడ్వాన్స్ సప్లమెంటరీ పరీక్షలు మూడో తేదీ నుంచి జూన్ 13వ తేదీ వరకు ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు జరుగుతాయి.పదో తరగతి పరీక్షలను మార్చి 18 నుంచి ఏప్రిల్? 2 వరకు నిర్వహించారు. పరీక్షలు రాసిన వారిలో బాలురు 2 లక్షల 57వేల 952 మంది, బాలికలు 2 లక్షల, 50 వేల 433 మంది ఉన్నారు. సుమారుగా 30వేల మంది ఇన్విజిలేటర్లు విధుల్లో పాల్గొన్నారు. జవాబు పత్రాల మూల్యాంకనం ఏప్రిల్? 20లోగా ముగించారు.మార్కుల నమోదుతో పాటు ఎలాంటి సాంకేతిక ఇబ్బందులూ రాకుండా తగిన జాగ్రత్తలు తీసుకున్నారు. జవాబు పత్రాలను మూడు సార్లు పరిశీలించడంతో పాటు కోడింగ్, డీకోడింగ్ ప్రక్రియను చేపట్టింది విద్యాశాఖ. ఎన్నికల కోడ్ అమల్లో ఉండటంతో ఎలక్షన్ కమిషన్ నుంచి అనుమతి తీసుకుని ఫలితాలను వెల్లడించింది.

# కృష్ణవేణి విద్యార్థుల ప్రభంజనం



**టీ మీడియా, ఏప్రిల్ 30, గోదావరిఖని ప్రతినిధి:** గోదావరిఖని పట్టణంలోని కృష్ణవేణి టాలెంట్ ఉన్నత పాఠశాల విద్యార్థులు పదో తరగతి ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. రాష్ట్ర ( ప్ బ, ు త్ ్వ ం మంగళవారం విడుదల చేసిన పదవ తరగతి ఫలితాల్లో ఖనికి చెందిన విద్యార్థులు 10 జీపీఏ మార్కులు సాధించారు. గోదావరిఖనిలోని అడ్డగుంటపల్లి, మార్కండేయ కాలనీలోని పలు కృష్ణవేణి టాలెంట్ స్కూల్ బ్రాంచ్ విద్యార్థులు పది ఫలితాల్లో పి. శ్రేయస్,ఎండి నిహాల్, కటుకోజ్వల సాయిచరణ్, పి. సాత్విక్,సాయివిగ్నేష్ లు 10 జీపీఏ గ్రేడ్ పాయింట్లు సాధించారు. అదేవిధంగా 9.8 గ్రేడ్ పాయింట్లు కే.కీర్తన,ఎం. హర్షిత,కె.సహస్ర,టి.మనస్విని, ఎండి.అశ్రత్, రెహమాన్ లు ప్రతిభ కనబరిచారు. పదో తరగతి ఫలితాల్లో ప్రభంజనం సృష్టించిన విద్యార్థులను పాఠశాల డైరెక్టర్ మంజుల శ్రీనివాస్ రెడ్డి, పాఠశాల ప్రిన్సిపాల్ లు రామకృష్ణ, రాజిరెడ్డి, సత్యనారాయణలు, ఉపాధ్యాయులు ప్రత్యేకంగా అభినందించారు.

# పతంజలి ఫార్మసీ ఉత్పత్తుల తయారీ లైసెన్స్ రద్దు




**టి మీడియా, ఏప్రిల్ 30,డెహ్రాడూన్ :**
పతంజలికి చెందిన 14 దివ్య ఫార్మసీ ఉత్పత్తుల తయారీ లైసెన్స్ రద్దయింది. ఉత్తరాఖండ్ డ్రగ్ లైసెన్సింగ్ అథారిటీ ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. ప్రజలను తప్పుదోవ పట్టించే విధంగా వాణిజ్య ప్రకటనలు ఇచ్చారని నిర్ధరణ అయిన నేపథ్యంలో ఈ మేరకు చర్యలు తీసుకుంది. వాణిజ్య ప్రకటన విషయంలో 'డ్రగ్స్ అండ్ మ్యాజిక్ రెమిడీస్ యాక్ట్', 'డ్రగ్స్ అండ్ కాస్మెటిక్ యాక్ట్'ను పతంజలి ఉల్లంఘించినట్లు అథారిటీ నిర్ధారించింది. ఉత్పత్తులకు సంబంధించి ప్రచారం చేసిన ప్రయోజనాలపై ఆధారాలను సమర్పించడంలో విఫలమైనట్లు తెలిపింది. అలాగే తమ వాదనను సమర్థించుకుంటూ ఇచ్చిన సమాధానం కూడా సంతృప్తికరంగా లేదని స్పష్టం చేసింది. ఆధునిక వైద్య విధానాలపై తప్పుడు ప్రచారం చేస్తున్నారంటూ %ొ% పతంజలి సంస్థపై ఇండియన్ మెడికల్ అసోసియేషన్ సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేసిన సంగతి విదితమే. దానిపై విచారణ జరిపిన న్యాయస్థానం-అసత్య, తప్పుదోవ పట్టించే ప్రకటనలు ఇవ్వొద్దని హెచ్చరించింది. ఇకపై అలాంటివేవీ ఉండబోవని అప్పట్లో సంస్థ తరఫు న్యాయవాది కోర్టుకు హామీ ఇచ్చారు. అయినా, వాటిని ఉల్లంఘించటంతో కోర్టు తీవ్రస్థాయిలో ఆగ్రహాన్ని వ్యక్తం చేసింది. బహిరంగ క్షమాపణలు చెప్పాలని ఆదేశించింది. ప్రస్తుతం ఈ అంశం సర్వోన్నత న్యాయస్థానం పరిధిలో ఉంది.

# నాకే ఇంకా రైతుబంధు రాలేదు..
## -తుమ్మల వ్యాఖ్యలపై కేసీఆర్ ట్వీట్



**టి మీడియా, ఏప్రిల్ 30,హైదరాబాద్ :** కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత అన్నదాతల జీవితంలో అంధకారం నెలకొన్న సంగతి తెలిసిందే. సాగుకు సరిపడా నీరు, కరెంట్ ఇవ్వకపోవడంతో పంటలు ఎండిపోయాయి. ఏదో అక్కడక్కడ పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేసే దిక్కు కూడా లేదు. ఇదంతా పక్కన పెడితే పంట పెట్టుబడి సాయం కింద ఇచ్చే రైతుబంధు ఊసే లేదు. రైతుబంధు అడిగితే చెప్పులతో కొడుతామని రైతులను బెదిరించారు కాంగ్రెస్ నాయకులు. అటు రైతుబంధు ఇవ్వక, ఇటు సాగునీరు, కరెంట్ ఇవ్వక రైతులను నట్టేట ముంచింది కాంగ్రెస్ ప్రభుత్వం.రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు రైతుబంధు తనకే ఇంకా రాలేదు అని ఓ సమావేశంలో మాట్లాడారు. తన పక్కనే ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క వైపు చూస్తూ.. నాకే ఇంకా రైతు బంధు రాలేదు.. ఎందయ్యా అని భట్టి విక్రమార్కను అడిగితే ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు ఇచ్చాక ఇస్తా అన్నాడు అని తుమ్మల నాగేశ్వర్ రావుపేర్కొన్నారు.తుమ్మల నాగేశ్వర్ రావు వ్యాఖ్యలపై బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ స్పందించారు. రైతుబంధు ఇవ్వకుండా తెలంగాణ రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం ద్రోహం చేసిందని, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు వ్యాఖ్యలతో స్పష్టమవుతోందని కేసీఆర్ ట్వీట్ చేశారు.

# పదవతరగతి పరీక్ష ఫలితాల్లో రాష్ట్రస్థాయి ర్యాంక్
## సాధించిన తవక్కల్ పాఠశాల విద్యార్థిని
## ం కొండ్ర సాహితి 10/10



**టీ మీడియా, ఏప్రిల్ 30, రామకృష్ణాపూర్ :**
క్యాతనపల్లి మున్సిపాలిటీ రామకృష్ణాపూర్ లో మంగళవారం విడుదల చేసిన పదవ తరగతి పరీక్ష ఫలితాలలో రామకృష్ణాపూర్ లోని తవక్కల్ పాఠశాల విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు.మొత్తం 84 మంది విద్యార్థులు పరీక్ష రాయగా 84 మంది విద్యార్థులు పాస్ అయ్యారు.అదేవిధంగా కొండ్ర సాహితీ అనే విద్యార్థిని రాష్ట్రస్థాయి ర్యాంక్ 10/10 సాధించింది. 9.8/10 ఐదుగురు విద్యార్థులు, 9. 7/10 ముగ్గురు విద్యార్థులు సాధించారు.ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులను తవక్కల్ విద్యా సంస్థల చైర్మెన్ అబ్దుల్ అజీజ్ సన్మానించారు.

# ఆంజనేయ పురం చెక్పోస్ట్ ను ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ



**టీ మీడియా, ఏప్రిల్ 30, మహానంది:**
మహానంది మండలం గాజులపల్లె గ్రామ పరిధిలోని ఆంజనేయపురం వద్దగల అంతర్ జిల్లా చెక్పోస్ట్ నంద్యాల జిల్లా ఎస్పీ కె.రఘువీర్ రెడ్డి మంగళవారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ...అక్కడ పనిచేసే సిబ్బంది అందరూ 24 %ఇ% 7 అప్రమత్తంగా ఉంటూ ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని, పలు సూచనలు జారీ చేయడం జరిగింది.ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో అక్రమ రవాణాకు అడ్డుకునేందుకు జిల్లా సరిహద్దులలో చెక్పోస్టులను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు.చెక్పోస్టులలో సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ, ప్రజలను ప్రలోభాలకు గురి చేయుటకు అక్రమంగా నగదు ,మద్యం , బంగారం, వెండి, గంజాయి, విలువైన వస్తువులు మొదలగునవి రవాణా కాకుండా అడ్డుకట్ట వేయాలని ,అందుకు ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని , జిల్లాలో ప్రశాంత ఎన్నికల లక్ష్యంగా పోలీస్ అధికారులు అన్ని చర్యలు తీసుకోవడం జరిగిందని,ఏదైనా అనుమానం వస్తే వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని జిల్లా ఎస్పీ ఆదేశించారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ తో పాటు స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ రవీంద్ర, నంద్యాల తాలూకా రూరల్ సీఐ శివకుమార్ రెడ్డి, పాల్గొన్నారు.

# టీ20 వరల్డ్ కప్ కు భారత జట్టు ఇదే..



**టి మీడియా, ఏప్రిల్ 30, న్యూఢిల్లీ :**
టీ20 వరల్డ్ కప్‌కు భారత జట్టును బీసీసీఐ ప్రకటించింది. 15 మంది ఆటగాళ్లతో జట్టును అనౌన్స్ చేసింది. టీమిండియా జట్టుకు రోహిత్ శర్మ కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. వైస్ కెప్టెన్ గా హార్దిక్ పాండ్యాను ఎంపిక చేశారు. రిషభ్ పంత్, సంజూ శాంసన్‌లను వికెట్ కీపర్లుగా ఎంపిక చేశారు.టీమిండియా జట్టు: రోహిత్ శర్మ (కెప్టెన్), యశస్వి జైశ్వాల్, విరాట్ కోహ్లీ, సూర్యకుమార్ యాదవ్, రిషభ్ పంత్ (వికెట్ కీపర్), సంజూ శాంసన్ (వికెట్ కీపర్), హార్దిక్ పాండ్యా (వైస్ కెప్టెన్), శివమ్ దూబే, రవీంద్ర జడేజా, అక్సర్ పటేల్, కుల్దీప్ యాదవ్, యజువేంద్ర చాహల్, అర్షదీప్ సింగ్, జస్ప్రీత్ బుమ్రా, మొహమ్మద్ సిరాజ్.రిజర్వ్ ఆటగాళ్లు: శుభ్ మన్ గిల్, రింకూ సింగ్, ఖలీల్ అహ్మద్, ఆవేశ్ ఖాన్.






# ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్..
## ఏడుగురు మావోయిస్టులు మృతి



**టి మీడియా, ఏప్రిల్ 30నారాయణపూర్:**
ఛత్తీస్గఢ్ లో భారీ ఎన్ కౌంటర్ జరిగింది. నారాయణపూర్-కంకేర్ సరిహద్దు ప్రాంతంలోని అబుజ్మర్లో భద్రతా బలగాలతో మంగళవారం జరిగిన ఎన్కౌంటర్లో ఇద్దరు మహిళలు సహా ఏడుగురు మావోయిస్టులు మరణించినట్లు పోలీసు ఉన్నతాధికారులు వెల్లడించారు. ఎన్కౌంటర్ స్థలం నుండి భారీ మొత్తంలో ఆయుధాలు, మందుగుండు సామాగ్రి, పేలుడు పదార్థాలతో సహా ఒక ఎకె 47 కూడా స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.ఇన్స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (బస్తర్ రేంజ్) పి సుందర్రాజ్ మాట్లాడుతూ.. "జిల్లా రిజర్వ్ గార్డ్ (డిఆరి), స్పెషల్ టాస్క్ ఫోర్స్ (ఎస్టిఎఫ్) సంయుక్త బృందం సోమవారం (ఏప్రిల్ 29) రాత్రి నుంచి నక్సల్ వ్యతిరేకగా సెర్చ్ ఆపరేషన్ చేపట్టింది. ఈ రోజు ఉదయం 6 గంటలకు టేక్మాటా, కాకూర్ గ్రామం మధ్య ఉన్న అటవీ ప్రాంతంలో బద్రతా బలగాలు, మావోయిస్టులకు మధ్య కాల్పులు జరిగాయి. ఈ కాల్పుల్లో ఏడుగురు మావోయిస్టులు మృతి చెందారు" అని తెలిపారు.ఘటనా స్థలం నుంచి ఇద్దరు మహిళా మావోయిస్టులతో సహా ఏడుగురు మృతదేహాలను స్వాధీనం చేసుకున్నట్లు ఐజీ తెలిపారు. చనిపోయిన మావోయిస్టుల వివరాలను ఇంకా గుర్తించలేదని.. ప్రస్తుతం సెర్చ్ ఆపరేషన్ కొనసాగుతుందని ఆయన తెలిపారు..





## మార్కెటింగ్‌లో పార్ట్ టైమ్/ఫుల్ టైమ్ పని చేయుటకు కావలెను

టీ మీడియా లోని ప్రింట్ /ఈ పేపర్ /పెళ్లి పందిరి /ఆన్లైన్ విభాగం /ఎలక్ట్రానిక్ విభాగం ల లో (టోటల్ తెలుగు మీడియా) మార్కెటింగ్ లో పార్ట్ టైమ్/ఫుల్ టైమ్.. (30నుండి 40శాతం )కమిషన్ బేసిక్ పై పని చేయూటకు ఆసక్తి ఉన్నవారు 8500515365 కి పంపగలరు. అవసరం అయిన శిక్షణ ఇస్తాము. నెలకు కనీసం గా రు 20వేలు ఆదాయం పొందే అవకాశం ఉంటుంది.

తమ వివరాలు :

పేరు :........................................................................

ప్రస్తుత నివాసం :..............................చదువు :..............................

సెల్ నెంబర్ :........................................................................